కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ

పర్యటన షెడ్యూల్ ఖరారు

నవంబర్ 2వ తేదీన పర్యటించనున్న అమిత్ షా

హైదరాబాద్ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో నవంబర్ 2వ తేదీన పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు కార్య క్రమాల్లో ఆయన పాల్గొన నున్నారు. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. బేగంపేట నుంచి కాకతీయ హోటల్‌కు వెళ్లనున్నారు. 4గంటల వరకు కాకతీయ

మిగతా 2లో

TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

ఆదివారం, నవంబర్ 01, 2026 | సంపుటి - 21 | సంచిక 20 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

ఏపీ స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం

పోలింగ్ విధుల్లో 51,716 మంది సిబ్బంది

పోలింగ్ కోసం ఏపీవ్యాప్తంగా పటిష్ఠ పోలీసు బందోబస్తు: ఐజీ రాజకుమారి

12,000 సీసీటీవీ కెమెరాల ఏర్పాటు..

11,378 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు: ఎస్ఈసీ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో నేడు జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వం సిద్ధమైందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. తొలిదశలో 100 పట్టణ స్థానిక సంస్థలకు (13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంస్థలు/నగర పంచాయతీలు) ఎన్నికలు జరుగను న్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 మున్సిపల్ ఛైర్మన్ పదవులు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా, పారదర్శక వాతావరణంలో ఎన్నికలు నిర్వహిం చడానికి, శాంతిభద్ర తలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నా మని స్పష్టం చేశారు. శనివారం విజయవాడలో ఎన్నికల కమిషనర్ మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి జిల్లాలో జనరల్, వ్యయ పరిశీలకులతో పాటు

మిగతా 2లో

ఏపీ సర్కార్ కీలక నిర్ణయం

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు పారితోషికం పెంపు..



అమరావతి : స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి పారితోషికాన్ని పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా కేటగిరీల వారీగా గతంలో ఉన్న పారితోషికంలో మార్పులు చేస్తూ జీవో జారీ చేసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి వివిధ కారణాలతో ప్రమాదం సంభవిస్తే ఇచ్చే పరిహారంలోనూ మార్పులు చేసింది. ఈ మేరకు జీవో నంబర్ - 1345,1346లను మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ జారీ చేశారు.

నిమజ్జనాలతో హుస్సేన్‌సాగర్‌లో

పెరిగిన నీటి కాలుష్యం

- పీసీబీ పరిశీలనలో సంచలన విషయాలు

హైదరాబాద్ నగరంలోని గణేశ్ విగ్రహాల నిమజ్జనం సమయంలో హుస్సేన్‌సాగర్‌లోని 6 పర్యవేక్షణ కేంద్రాల్లో మురుగు(టర్బిడిటీ) విలువలు పెరిగినట్టు పొల్యూషన్? కంట్రోల్ బోర్డు చేసిన నీటి నాణ్యతా పరీక్షల్లో తేలింది. నిమజ్జనం తర్వాత అంతకు ముందు స్థాయికి చేరుకోలేదని పీసీబీ పరిశీలనలో వెల్లడైంది. నెక్లెస్‌రోడ్ ప్రాంతంలో నిమజ్జన సమయంలో అత్యధికంగా 200 ఎన్‌టీయూ(నెఫెలోమెట్రిక్ టర్బిడిటీ యూనిట్) టర్బి డిటీ నమోదైంది. సెప్టెంబర్ 14వ తేదీ వినాయకచవితి రోజు, నిమజ్జనానికి ముందు 11వ తేదీ, 17, 19, 21, 23 తేదీల్లో నిమజ్జన సమయంలో, నిమజ్జనం అనంతరం 28వ తేదీన

2లో

తెలంగాణలో బ్యాలెట్

ఎన్నికలకు సిద్ధమా

సీఎం రేవంత్‌కు బండి సంజయ్ సవాల్

హైదరాబాద్ : తెలంగాణలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలకు వెళ్తే తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేసేందుకు సిద్ధమని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధమైతే తాను, తమ పార్టీ కేంద్ర నాయకత్వాన్ని ఒప్పిస్తామని స్పష్టం చేశారు. ఈనాటి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) ప్రక్రియతోనే కాంగ్రెస్ అధికారం కోల్పోయిందా? అని ప్రశ్నించారు. తమిళనాడులో 60 ఏళ్ల నుంచే కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోయిందని ప్రస్తావించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో 50 ఏళ్లుగా అధికారంలోకి ఎందుకు రాలేదని నిలదీశారు. సిక్కింలో 1975లో రాష్ట్ర హోదా పొందినప్పటి నుంచి ఒక్కసారి కూడా అధికారంలోకి కాంగ్రెస్ రాలేదని గుర్తుచేశారు. యూపీలో 37 ఏళ్లుగా, బీహార్‌లో 36 ఏళ్లుగా, త్రిపురలో 34 ఏళ్లుగా, గుజరాత్‌లో 31 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి రానేలేదని స్పష్టం చేశారు. ఒడిశా, జార్ఖండ్‌లో 26 ఏళ్లుగా, మధ్యప్రదేశ్, నాగాలాండ్‌లో 23 ఏళ్లుగా, గోవాలో 14 ఏళ్లుగా కాంగ్రెస్‌కు అధికారం అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఏపీ, హర్యానా, మహారాష్ట్రంలో 12 ఏళ్లుగా, అరుణాచల్ ప్రదేశ్, అసోంలో పదేళ్లుగా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లో 9 ఏళ్లుగా అధికారరంలోనే లేదని చెప్పుకొచ్చారు. మేఘాలయ, మిజోరాంలో 8 ఏళ్లుగా, పంజాబ్‌లో 4 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకే రాలేదు కదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. 2014 నుంచి కాంగ్రెస్ ఓడిపోతునే ఉందని అన్నారు. కేరళం, తెలంగాణ, కర్నాటకలో ఈ ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో

మిగతా 2లో

హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ కూల్చివేతలకు పాల్పడిన హైడ్రా

హైదరాబాద్ : నగరంలోని రామాంత పూర్‌లో పెద్దచెరువు పరిధిలో నిర్మాణాలు న్నాయంటూ హైడ్రా అధికారులు చేపట్టిన కూల్చివేతలపై యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ.. హైడ్రా కూల్చివేతలకు పాల్ప డిందంటూ మండి పడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. నగరంలోని రామాంత పూర్‌లో కొన్నేళ్లుగా 'మధురా బార్ షెడ్'ను నిర్వహిస్తున్నారు.

మిగతా 2లో

హైదరాబాద్‌లో నవంబర్ 1 నుంచి గ్రీన్

ట్యాంకర్ల సేవలు ప్రారంభం

గ్రీన్ ట్యాంకర్ల బుకింగ్ కోసం ప్రత్యేక మొబైల్ యాప్..

సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, అక్టోబరు 31 : నవంబర్ ఒకటో తేదీ నుంచి హైదరాబాద్‌లో గ్రీన్ ట్యాంకర్ల సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు (ంవశ్రీఖఅస్త్రుఖఖ జూ ాఖఅయిఖఎ జీఖయబ) ప్రకటించారు. తాగునీరు అవసరం లేని పనులకు శుద్ధి చేసిన నీటినే వాడాలని సూచించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో హైదరాబాద్‌లో తాగునీటి సరఫరాపై సీఎస్ సంజయ్ జాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

2లో

5.85 లక్షల ఎకరాలకు సాగునీరు

అందించడమే లక్ష్యం

మహారాష్ట్ర ముంపు, పర్యావరణ ఆందోళనలకు ఆచరణాత్మక పరిష్కారాలు చూపాలి : మంత్రి ఉత్తమ్

హైదరాబాద్ : మహారాష్ట్ర ముంపు, పర్యావరణ ఆందోళనలకు ఆచరణాత్మక పరిష్కారాలు చూపాలని అధికారులను తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సాగునీటి లక్ష్యాలకు భంగం కలగకుండా పర్యావరణ ప్రభావాన్ని తగ్గించాలని సూచించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ అలైన్‌మెంట్లు, సాంకేతిక అంశాలపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. అటవీ భూములు, జనావాసాలు, పర్యావరణ సున్నిత ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మహారాష్ట్ర అభ్యంతరాలను పరిష్కరించేలా ఇంజినీరింగ్ మార్పులను పరిశీలించాలని మంత్రి ఉత్తమ్ మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహెట్టి ఎఫ్ఆర్ఎల్‌ను 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదనలు చేసిందని వెల్లడించారు. 152 మీటర్ల నీటిమట్టంతో 5.697 టీఎంసీలకు నిల్వ సామర్థ్యం పెరగనుందని తెలిపారు.

2లో

తెలంగాణలో క్రాప్ హాలిడేపై

మంత్రి తుమ్మల క్లారిటీ

రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలి

హైదరాబాద్ : రాష్ట్రంలో క్రాప్ హాలిడేపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. క్రాప్ హాలిడేపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమని.. రైతులు ఈ విషయాన్ని నమ్మొద్దని అన్నారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త విపత్తు అని.. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్తలను తాము తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు నెలలుగా రైతన్నలకు ఎల్‌నినోపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి, సమీకృత పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రతి వారం వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను అన్నదాతలకు చేరవేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. రైతులకు సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 365 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి, రైతన్నలకు అండగా తమ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్నదాతలకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని తెలిపారు. రైతన్నలను నష్టాల నుంచి కాపాడేందుకు అన్ని చర్యలు

మిగతా 2లో

తెలంగాణలో బ్యాలెట్ ఎన్నికలకు సిద్ధమా

జరిగితే కాంగ్రెస్ గెలిచింది కదా అని ప్రస్తావించారు. ఓడిపోతే ఈవీఎంలపైనా విష ప్రచారం చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందని ధ్వజమెత్తారు. ఈవీఎంలతో తొలిసారి ఎన్నికలకు వెళ్లిందే రాజీవ్ గాంధీ హయాంలో కదా అని గుర్తుచేశారు. బ్యాలెట్ ద్వారా జరిగిన ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయింది కదా అని చెప్పారు. అసోంలో బ్యాలెట్‌తో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని తెలిపారు. తెలంగాణలో బ్యాలెట్ ద్వారా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని అన్నారు. నిన్నటికి నిన్న 4 రాష్ట్రాల్లో బ్యాలెట్‌తో జరిగిన 28 ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ ఏం సమాధానం చెబుతుందని బండి సంజయ్ ప్రశ్నించారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు

హోటల్‌లో కేంద్ర హోం మంత్రి బసచేయనున్నారు. 4గంటలకు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించనున్న ర్యాలీలో అమిత్ షా పాల్గొననున్నారు. 5 గంటల నుంచి 5:30 వరకు ఎంజే మార్కెట్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌కు అమిత్ షా హాజరుకానున్నారు. అనతరం 6గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు ఉన్న రిజర్వ్ షెడ్యూల్‌లో రాష్ట్రంలోని ప్రముఖులను కేంద్ర హోం మంత్రి కలిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ ముఖ్య నేతలతో కూడా అమిత్ షా భేటీ అయ్యే ఛాన్స్ ఉంది.

హైదరాబాద్‌లో నవంబర్ 1 నుంచి గ్రీన్ ట్యాంకర్ల సేవలు ప్రారంభం

నీటి నాణ్యతపై నిరంతర పర్యవేక్షణకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. శుద్ధి చేసిన నీటి సరఫరాపై రోజువారీ నివేదిక ఇవ్వాలని ఎవీజెబాదీ ఎండీని ఆదేశించారు. మిషన్ భగీరథ అదనపు 40 వీ+ఐ నీటి పథకం నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు. విలీనమైన పట్టణ స్థానిక సంస్థలకు వచ్చే ఏడాది ఆగస్టు వరకు బల్క్ వాటర్‌ను సరఫరా చేయాలని సూచించారు. గ్రీన్ ట్యాంకర్ల ద్వారా డిమాండ్ మేరకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. గ్రీన్ ట్యాంకర్ల బుకింగ్ కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నీటి వినియోగాన్ని 20 శాతం తగ్గించడమే సేవ్ వాటర్ క్యాంపెయిన్ లక్ష్యమని సీఎస్ సంజయ్ జాజు పేర్కొన్నారు.

5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

77 టీఎంసీల నీటిని మళ్లించేలా బ్యారేజ్ రూపకల్పన చేసినట్టు చెప్పుకొచ్చారు. ఏడు జిల్లాల్లో 5.85 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని ఉద్ఘాటించారు. ముంపు, పునరావాస సమస్యలకు సాంకేతిక పరిష్కారాలపై దృష్టిసారించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

తెలంగాణలో క్రాప్ హాలిడేపై మంత్రి తుమ్మల క్లారిటీ

తీసుకుంటున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం వస్తోందని.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కల్పిస్తోందని వెల్లడించారు. నవంబర్ నుంచి మార్చి వరకు మొత్తం 35.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతుల్లు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ కూల్చివేతలకు పాల్పడిన హైడ్రా

కాగా.. ఈ షెడ్ చెరువు పరిధిలో ఉందని.. కూల్చివేస్తామని హైడ్రా అధికారులు యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో కంగారు పడిన యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. 40 ఏళ్లుగా ప్రభుత్వానికి మున్సిపల్ పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని.. చెరువు పరిధిలో భూమి ఉంటే.. ఇన్నేళ్లుగా పన్నులు ఎందుకు వసూలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు స్పందించిన హైకోర్టు.. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి ఆ స్థలం వస్తుందా.. రాదా.. అని తేలేవరకు.. యథాతథ స్థితి(స్టేటస్ కో) ని పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ .. హైడ్రా అధికారులు షెడ్లను కూల్చివేశారు. ఎఫ్‌టీఎల్ సరిహద్దులను ముందుగా ఖరారు చేసిన తర్వాతే.. హైడ్రా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరినా ఫలితం లేకపోయిందని బాధితులు వాపోయారు. చట్టబద్ధంగా ఉన్న భూముల విషయంలో ప్రభుత్వం.. నిబంధనల ప్రకారం సరైన ప్రక్రియను అనుసరించిన తర్వాతే చర్యలు చేపట్టాలని యజమానులు విజ్ఞప్తి చేశారు.

నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్18

శ్రీహరికోట : భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ఒక భారీ రాకెట్‌ను ప్రయోగించి విజయవంతమైంది. జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్, 2026 అక్టోబర్ 30వ తేదీన రాత్రి 11:51 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 అనే నావిగేషన్ ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ఉపగ్రహం భారతదేశపు నావిగేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. జీఎస్ఎల్వీ రాకెట్ తన 20వ ప్రయోగం. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం రెండవ లాంచ్ ప్యాడ్ నుండి ప్రవేశపెట్టిన ఇస్రో.. మూడు దశల్లో ప్రవేశపెట్టి సక్సెస్ చేసింది. దీంతో ఇస్రోలో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. ఐఆర్-03 2232 బరువుగల శాటిలైట్ ను నింగిలోకి మోసుకెళ్లింది. భారత్ సొంతంగా తయారు చేసుకున్న నావిగేషన్ వ్యవస్థను బలోపేతానికి ఐఆర్-03ని ప్రయోగించింది. ఈ ఉపగ్రహం13 ఏళ్ల పాటు కక్ష్యలో పని చేయనుంది.ఐఆర్-03 అనేది రెండవ తరం నావిక్ ఉపగ్రహాలలో మూడవది. దీనికి స్వదేశీంగా తయారు చేసిన అటామిక్ క్లాక్, కొనుగోలు చేసిన అటామిక్ క్లాక్‌ను అమర్చారు. మునుపటి ఉపగ్రహాలలో ఒ5 , ౨ సిగ్నల్స్ ఉండేవి. ఇప్పుడు కొత్తగా ఒ1 సిగ్నల్‌ను జోడించారు. ఇది నావిగేషన్‌ను మరింత మెరుగుపరుస్తుంది. ఈ ఉపగ్రహం భారతదేశ భూభాగం, దాని చుట్టూ 1,500 కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతానికి కచ్చితమైన ప్రదేశం, వేగం, సమయ సమాచారాన్ని అందిస్తుంది.నావిక్ అనేది భారతదేశపు సొంత నావిగేషన్ వ్యవస్థ. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. ఒకటి సాధారణ ప్రజల కోసం ఉద్దేశించిన 'స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్', మరొకటి ప్రత్యేక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన 'రెస్ట్రిక్టెడ్ సర్వీస్'.ఇస్రో మొత్తం ఐదు సెకండ్ జనరేషన్ ఉపగ్రహాలను నిర్మించాలని యోచిస్తోంది. ఇస్రో 2023 మే 29న జీఎస్ఎల్వీ-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-01ను అంతరిక్షంలోకి ప్రయోగించింది. ఇది మొట్టమొదటి స్వదేశీ అణు గడియారాన్ని మోసుకెళ్లింది. ఇప్పుడు ఈ రోజు ప్రయోగించిన కొత్త ఉపగ్రహం ఎన్వీఎస్-03, ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. ఈ వ్యవస్థ వాహన నావిగేషన్, లొకేషన్ సేవలు, ఇతర ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఇది ఒకప్పుడు ఇతర దేశాల వ్యవస్థపై భారతదేశం ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అందువల్ల ఈ రాత్రి జరిగే ఇస్రో ఉపగ్రహ ప్రయోగం దేశానికి చాలా కీలకం.

గాళ్స్ హాస్టల్ అడ్డగా... అండాల సేకరణ...

హైదరాబాద్, అక్టోబరు 21 : అది పేరుకే లేడీస్ హాస్టల్.. చేసేది అండాల బిజినెస్.. బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో బయటపడ్డ అండాల అక్రమ దందా.. హైదరాబాద్‌లో గర్ల్స్ హాస్టల్ పేరుతో నడుపుతున్న గలీజ్ దందా గుట్టురట్టు అయింది. బేగంపేటలో యువతుల అండాల సేకరణ ముఠా వ్యవహారం బట్టబయలు అయింది. బేగంపేట పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసుల సంయుక్తంగా దాడుల్లో 10మంది యువతులు అడ్డంగా బుక్యవడం కలకలం రేపుతోంది. హైదరాబాద్ బేగంపేటలో యువతుల అండాల అక్రమ సేకరణ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ప్రకాశ్‌నగర్‌లోని నక్షత్ర అపార్ట్‌మెంట్‌లో గలీజ్ వ్యవహారం సాగుతున్నట్టు ఆరోపణలు రావడంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. అర్ధరాత్రి 2గంటల సమయంలో బేగంపేట పోలీసులు, ఎస్‌ఓటీ బృందాలు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ దారుణ వ్యవహారం బయటపడింది. పోలీసులకు 10మంది యువతులు పట్టుబడటం సంచలనం రేపింది. వీరిని బిహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశాకు చెందిన యువతులుగా గుర్తించి.. అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.బేగంపేట ప్రకాశ్‌నగర్‌లో ఏడాదికాలంగా అమీ నీతా గర్ల్స్ హాస్టల్ పేరుతో ఈ అక్రమ అడ్డగోలు కార్యకలాపాలు సాగిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలోనే.. అండాల సేకరణతో పాటు సంతాన సాఫల్య కేంద్రాలతో సంబంధాలపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. యువతుల నుంచి అండాలను సేకరించి సమీపంలోని సంతాన సాఫల్య కేంద్రాలకు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మహిళల అండాలతో పాటు పురుషుల వీర్యకణాల సరఫరాకు సంబంధించిన దందాపైనా పోలీసులు ఫోకస్ పెట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఓ మహిళ ప్రమేయం ఉందనే అనుమానంతో ఆమెను కూడా ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే.. అండాల అక్రమ సేకరణ, విక్రయాల వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే.. అండాల సేకరణలో యువతుల సమ్మతి ఉందా?.. డోనర్స్ విషయంలో అసలు మెడికల్ రూల్స్ పాటిస్తున్నారా?.. అండాల సరఫరా వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు?.. ఈ అండాలను ఏ ఫెర్టిలిటీ సెంటర్లకు పంపుతున్నారనే వివరాలను సేకరించే పనిలో పడ్డారు పోలీసులు. ఇక.. ప్రకాశ్‌నగర్‌లోని అమీ నీతా గర్ల్స్ హాస్టల్‌లో ఎప్పటినుంచో చాలా మంది మహిళలు ఉంటున్నారని స్థానికులు చెప్పారు. అంతా బయట రాష్ట్రాల యువతులేనని తెలిపారు. అర్ధరాత్రి సమయంలో ఇంటి పక్కన అపార్ట్‌మెంట్లో పోలీసులు దాడులు చేయడంతో ఆందోళనకు గురయ్యామన్నారు స్థానికులు. తీరా చూస్తే.. కొంతమంది యువతులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసిందని చెప్పారు. మొత్తంగా.. హైదరాబాద్‌లో మరోసారి అండాలు, వీర్యకణాల అక్రమ సేకరణ దందా గ్యాంగ్ గుట్టు రట్టయింది. గర్ల్స్ హాస్టల్ పేరుతో యువతుల అండాలను సేకరించి.. ఫెర్టిలిటీ సెంటర్లకు విక్రయిస్తున్న ముఠా బండారాన్ని బేగంపేట పోలీసులు బట్టబయలు చేయడం సంచలనంగా మారింది.

ఏపీ స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం

పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఏకగ్రీవాలు పోనూ మిగిలిన 13 కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీల్లోని మొత్తం - 3,186 వార్డులకు రేపు (ఆదివారం) పోలింగ్ జరగనుందని వివరించారు. ఈ ఎన్నికల కోసం మొత్తం 11,378 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 51,716 మంది సిబ్బందిని విధుల్లో నియమించామని చెప్పుకొచ్చారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కవరేజ్, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీను భద్రపరిచే గడువును 30 రోజుల నుంచి 60 రోజులకు పెంచామని తెలిపారు. ఎలక్షన్ పిటిషన్లు పరిష్కారమయ్యే వరకు వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల పోలింగ్ కోసం ఏపీవ్యాప్తంగా పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఐజీ రాజకుమారి తెలిపారు. ఎన్నికల విధుల్లో మొత్తం 36,351 మంది పోలీసు బలగాలు విధుల్లో ఉన్నాయని వెల్లడించారు. సమస్యాత్మక, హింసాత్మక ప్రాంతాల్లో 130 ప్లాటూన్ల ఏపీ స్పెషల్ పోలీసు బలగాల ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చారు. హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో 1+4, 1o3 సెల్‌తో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సెస్ విధుల్లో ఉన్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీలు, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 6,600 పోలింగ్ కేంద్రాల్లో దాదాపు 12,000 సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేసినట్లు ఐజీ రాజకుమారి వివరించారు. బ్యాలెట్ బాక్సుల తరలింపు, రూట్ క్లియరెన్స్ కోసం 1,543 రూట్ మొబైల్ వాహనాల వినియోగిస్తున్నట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్పీ, సీనియర్ అధికారుల పర్యవేక్షణలో క్విక్ రియాక్షన్ టీమ్స్ ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎన్నికల కోడ్ (విజిల) ఉల్లంఘనలను అడ్డుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం డేటాను అధికారులు వెల్లడిస్తారని ఐజీ రాజకుమారి పేర్కొన్నారు.

పెద్ద ప్లాన్‌తోనే తెలంగాణలో అమిత్ షా

హైదరాబాద్, అక్టోబరు 31 : తెలంగాణ గడ్డపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేరుగా రంగంలోకి దిగి పాదయాత్రలో పాల్గొంటున్నారు. ఇందు కోసం బీజేపీ గట్టి ఏర్పాట్లు చేస్తోంది. ఈ పాదయాత్ర కార్యక్రమం ఆషామాషీ రాజకీయ పరిణామం కాదు. బీజేపీ జాతీయ వ్యూహరచనలో పశ్చిమ బెంగాల్‌ను ఒక దశలో ప్రధాన టార్గెట్‌గా ఎంచుకుని అక్కడ ఎలాగైతే కాషాయ దళాన్ని విజేతగా నిలబెట్టారో.. అదే తరహాలో తెలంగాణలోనూ జెండా పాతేలా చేయాలనుకుంటున్నారు. బెంగాల్ తర్వాత దక్షిణాదిలో బీజేపీకి తెలంగాణనే అసలైన లక్ష్యమని అమిత్ షా గతంలో పలుమార్లు కుండబద్దలు కొట్టారు. సాధారణంగా కేంద్ర స్థాయిలోనే వ్యూహాలు రచించే చాణక్యుడు స్వయంగా రోడ్డుపైకి వచ్చి అడుగులు వేస్తున్నారంటే, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ దూకుడును ఏ స్థాయికి తీసుకెళ్లబోతున్నారో స్పష్టమవుతోంది.ఈ భారీ రాజకీయ సమరానికి ముందుగా పార్టీలోని అంతర్గత సమస్యలను చక్కదిద్దే కసరత్తును అధిష్ఠానం వేగవంతం చేసింది. పార్టీ రాష్ట్ర సారథిగా బాధ్యతలు చేపట్టిన కొత్త నాయకత్వం.. నేతల మధ్య ఉన్న ఆధిపత్య పోరు బహిర్గతం కాకుండా, ఆ ప్రభావం కేడర్‌పై పడకుండా ఇప్పటికే అంతర్గత సర్దుబాట్లు చేసింది. క్షేత్రస్థాయిలో ఈటల రాజేందర్, బండి సంజయ్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్ర నేతలు ఎవరికి వారు ప్రజాసమస్యలపై తమదైన శైలిలో పోరాడుతున్నప్పటికీ.. అంతిమంగా పార్టీ వేదికపైకి వచ్చేసరికి ఐక్యతను ప్రదర్శించేలా క్రమశిక్షణను నిర్దేశించారు. ఈ అంతర్గత సమన్వయం పక్కాగా కుదిరితే, నేతల వ్యక్తిగత బలాలన్నీ కలిసి పార్టీకి భారీ సంయుక్త శక్తిగా మారి మైలేజీని తెచ్చిపెడతాయన్నది పార్టీ పెద్దల అంచనా.అమిత్ షా స్వయంగా మైదానంలోకి దిగి రోడ్‌మ్యాప్‌ను అమలు చేయడం ప్రారంభిస్తే.. రాబోయే ఆరు నెలల్లో తెలంగాణ రాజకీయ సమీకరణాలు సమూలంగా మారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించి ప్రస్తుతం వరుస ఓటములు, అంతర్గత కుమ్ములాటలతో ఉనికిని కాపాడుకునేందుకు తంటాలు పడుతున్న బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలైన లక్ష్యం. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తి, రైతాంగ, పట్టణ సమస్యలను బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకుని.. ప్రతిపక్ష స్థానాన్ని తమ వశం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. కాషాయ దళంతో భర్తీ చేయాలని ఢిల్లీ నాయకత్వం గట్టి పట్టుదలతో ఉంది.అమిత్ షా తాజా రాజకీయ ఎత్తుగడలు క్షేత్రస్థాయిలో అమలైతే.. తెలంగాణలో ప్రధాన పోరు 'బీజేపీ వర్సెస్ కాంగ్రెస్' అన్నట్లుగా పూర్తిస్థాయిలో బైపోలార్‌గా మారిపోయే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దూకుడు, ప్రజాక్షేత్రంలో అగ్రనేతల వరుస పర్యటనలు, బూత్ స్థాయి వ్యవస్థాగత బలోపేతం వంటి త్రిముఖ వ్యూహాలతో రేవంత్ ప్రభుత్వాన్ని నాలుగు వైపుల నుంచి ఉక్కిరిబిక్కిరి చేయనున్నారు. గులాబీ పార్టీ కనుమరుగై, కాంగ్రెస్‌కు ఏకైక తిరుగులేని ప్రత్యామ్నాయం బీజేపీయేనన్న బలమైన భావనను ఓటర్లలో నాటడం ద్వారా.. తెలంగాణలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు అమిత్ షా వేసిన ఈ పాదయాత్ర స్కెచ్ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పనుందనడంలో సందేహం లేదు.

అడ్డూ, అదుపు లేకుండా పెరుగుతున్న బియ్యం...

హైదరాబాద్, అక్టోబరు 31 : తెలంగాణలో ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలతో అల్లాడుతున్న సామాన్యుడిని ఆదుకునే క్రమంలో.. సాధారణ ప్రజలు విస్తృతంగా వినియోగించే బీపీటీ రకం బియ్యం ధర కిలో రూ. 66 మించకూడదంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. మార్కెట్లో ప్రీమియం, సన్నబియ్యం ధరలు క్వింటాళ్లకు వేల రూపాయలు ఎగబాకి, కిలో రూ. 90 నుంచి రూ. 100 దాకా పలుకుతూ మధ్యతరగతి జేబులకు చిల్లులు వేస్తున్న వేళ.. ప్రభుత్వం కఠిన హెచ్చరికలు జారీ చేయడం ఊరటనిచ్చే అంశం. అయితే, గతంలోనూ ధరల నియంత్రణపై ఎన్నోసార్లు ఇలాంటి సమీక్షలు, గంభీర ప్రకటనలు వచ్చినప్పటికీ.. క్షేత్రస్థాయి రిటైల్ దుకాణాల్లో వ్యాపారుల ఆగడాలకు ఏమాత్రం అడ్డుకట్టపడకుండా యథేచ్ఛగా దోపిడీ సాగించిన చేదు అనుభవాలు ఉన్నాయి.ఈసారి కేవలం మాటలతో సరిపెట్టకుండా పౌరసరఫరాలు, పోలీసు, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ వంటి ఐదు విభాగాలతో సంయుక్త తనిఖీలు చేపట్టడం, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ వంటి ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లలో దాడులు చేసి 12 కేసులు నమోదు చేయడం ప్రభుత్వ సీరియస్‌నెస్‌ను సూచిస్తోంది. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్టుకు తరలించే మిల్లర్లు, హోల్‌సేలర్ల నెట్‌వర్క్‌ను గుర్తించి చర్యలు తీసుకోవడం మంచి పరిణామమే. అయితే, ఈ దాడులు కేవలం పెద్ద హోల్‌సేల్ మండీల వద్ద ఫోటోషూట్‌కే పరిమితమైతే ఫలితం శూన్యం. నగరాలు, పట్టణాలు, పల్లెల్లో ఉండే చిన్న చిన్న కిరాణా షాపులు, రిటైల్ మార్కెట్ల దాకా నిరంతర నిఘా ఉంటేనే ఈ రూ. 66 ధరల పరిమితి ప్రజలకు వాస్తవంగా ఉపయోగపడుతుంది.ప్రభుత్వం చెబుతున్నట్లుగా రాష్ట్రంలో సరిపడా ధాన్యం నిల్వలు ఉన్నాయని, వినియోగదారులు భయాందోళనలకు గురై పెద్ద ఎత్తున నిల్వ చేసుకోవద్దని మంత్రి ధైర్యం చెబుతున్నప్పటికీ.. కొరత భయాన్ని తొలగించాల్సింది కేవలం మాటలతో కాదు, మార్కెట్ స్థిరీకరణతోనే. రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని, వాటిని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ బియ్యం పంపిణీ నాణ్యత, సరఫరా గొలుసులో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత కూడా పౌరసరఫరాల శాఖపైనే ఉంది. రేషన్ బియ్యం నాణ్యతపై ప్రజల్లో నమ్మకం పెంచితే తప్ప ఓపెన్ మార్కెట్ బియ్యంపై ఆధారపడటం తగ్గదు. ఆర్‌ఎన్‌ఆర్ రకాల ధరలను కూడా సమీక్షిస్తామని చెబుతున్న సర్కారు.. కేవలం ఒకే రకంపై కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఇతర నాణ్యమైన బియ్యం రకాలపై కూడా స్పష్టమైన ధరల పట్టికను అమలు చేయాల్సి ఉంది.టాస్క్‌ఫోర్స్ తనిఖీలను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలన్న సూచనలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే బడా మిల్లర్ల లైసెన్సులు రద్దు చేయడం, అక్రమ నిల్వలను సీజ్ చేసి బహిరంగ మార్కెట్లో రేషనల్ ధరకే అమ్మేలా చేయడం వంటి కఠిన చర్యలు చేపడితేనే వ్యాపారుల్లో భయం పుడుతుంది. అలా కాకుండా ఒకట్రెండు రోజుల హడావుడి తర్వాత తనిఖీలు చల్లబడితే.. వ్యాపారులు మళ్లీ కృత్రిమ కొరత సృష్టించి మరింత ఎక్కువ ధరలకు విక్రయించే ప్రమాదం ఉంది. పాలకుల చిత్తశుద్ధి ప్రభుత్వ ఆదేశాల ఫైల్‌లో కాదు.. గల్లీలోని కిరాణా కొట్టులో సామాన్య వినియోగదారుడు కొనే సంచిలో బియ్యం పోయించుకునేటప్పుడు కనిపించే ధరలోనే ప్రతిబింబిస్తుందన్న నిజాన్ని ప్రభుత్వం విస్మరించకూడదు.

తొమ్మిది నియోజకవర్గాలకు తాగునీటి ముప్పు...

హైదరాబాద్, అక్టోబరు 31 : ఎలినినో వర్షాభావంతో మంజీర, సింగూరు జలాశయాలు అడుగంటి, హైదరాబాద్‌లోని 9 నియోజకవర్గాల్లో నీటి ఎద్దడితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.ఎలినినో ప్రతికూల వర్షాభావ పరిస్థితులు హైదరాబాద్ మహానగర ప్రజలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. నగరంలోని ప్రధాన తాగునీటి ఆధారాలైన మంజీర, సింగూరు జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిపోతుండటమే దీనికి కారణం. హైదరాబాద్ సిటీ పరిధిలో మొత్తం 22 నియోజకవర్గాలు ఉండగా.. అందులో మంజీరా పైప్‌లైన్ల ద్వారా ఉన్న 9 నియోజకవర్గాల్లో నీటి సమస్య తీవ్రమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నీటి ముప్పును తిప్పికొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.హైదరాబాద్ సిటీకి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలతో పాటు మంజీరా, సింగూరు, కృష్ణా, గోదావరి జలాల నుంచి తాగునీటి సరఫరా అవుతోంది. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా, జంట జలాశయాల్లో ఉన్న నీటిని రాబోయే 360 రోజులకు సరిపోయేలా జలమండలి ప్లాన్ చేసింది. సాధారణంగా సరఫరా చేయాల్సిన 40 ఎంజీడీలకు (మిలియన్ గ్యాలన్స్ పర్ డే) బదులుగా.. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రస్తుతం 27 ఎంజీడీలను మాత్రమే అందిస్తున్నారు.సింగూరు జలాశయ గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 3.029 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. మంజీరాలో 1.50 టీఎంసీలకుగాను కేవలం 0.19 టీఎంసీల నీరు ఉంది. ఈ రెండు జలాశయాల్లో కలిపి కేవలం 10 శాతం నీరు మాత్రమే ఉంది. నీటి ఆవిరి, పైపులైన్ల లీకేజీలు పోను ఈ నిల్వలు గరిష్టంగా మరో 60 రోజులకు మాత్రమే సరిపోతాయని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. అందుకే ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి, అది కూడా కేవలం 45 నిమిషాల వ్యవధిలోనే నీటిని సరఫరా చేస్తున్నారు.మంజీరా ఆధారిత ప్రాంతాలైన కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, సనత్‌నగర్, రాజేంద్రనగర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. శేరిలింగంపల్లి ఐటీ కారిడార్ తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట్, బంజారాహిల్స్, సోమాజిగూడ, నార్సింగి, నిజాంపేట్ వంటి ప్రాంతాల్లో నీటి ట్యాంకర్లకు విపరీతంగా డిమాండ్ పెరిగింది.

నిమజ్జనాలతో హుస్సేన్ సాగర్‌లో పెరిగిన నీటి కాలుష్యం

కాలుష్య నియంత్రణ మండలి నాణ్యతా పరీక్షలను చేపట్టింది. పరీక్షించిన ప్రదేశాలు.. 1.కంట్రోల్ పాయింట్ బుద్ధ విగ్రహం దగ్గర (హుస్సేన్‌సాగర్ మధ్యలో) 2. లుంబినీ పార్క్ దగ్గర, 3.ఎన్టీఆర్ పార్క్ ఎదురుగా ప్లాట్‌ఫాం నంబరు-1 వద్ద, 4. ఎన్టీఆర్ పార్క్ ఎదురుగా ప్లాట్‌ఫాం నంబరు- 2 వద్ద, 5. నెక్లెస్ రోడ్ వద్ద, 6. నిమజ్జన ప్రాంతం దగ్గర్లోని లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్ వద్ద, పీసీబీ పరీక్షల్లో ఏం తేలిందంటే? గణేశ్ నిమజ్జన సమయంలో అన్ని పర్యవేక్షణ కేంద్రాల్లో టోటల్ సస్పెండెడ్ సాలిడ్స్(టీఎస్ఎస్) విలువలు పెరిగాయని కాలుష్య నియంత్రణ పేర్కొంది. ఎన్టీఆర్ పార్కు ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం నంబరు-1 వద్ద నిమజ్జన సమయంలో అత్యధికంగా లీటరుకు 99 మిల్లీగ్రాముల టీఎస్ఎస్ నమోదైందని తెలిపింది. నిమజ్జన సమయంలో అన్ని ప్రాంతాల్లోనూ కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (సీవోడీ) విలువలు గణనీయంగా పెరిగాయని పీసీబీ పరిశీలనలో వెల్లడైంది. నెక్లెస్‌రోడ్ వద్ద అత్యధికంగా లీటరుకు 164 మి.గ్రా కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ నమోదైంది. నిమజ్జనం తర్వాత అన్ని ప్రాంతాల్లో సీవోడీ విలువలు నిమజ్జనానికి ముందున్న స్థాయికి తిరిగి చేరుకోలేదని వెల్లడించారు. ప్లాట్‌ఫాం నంబర్ 1, 2, నెక్లెస్ రోడ్, బుద్ధ విగ్రహం సమీపంలోని ప్రాంతాల్లో నిమజ్జన సమయంలో ఫీకల్ కోలిఫామ్ బ్యాక్టీరియా స్థాయిలు గణనీయంగా పెరిగినట్లు పీసీబీ గుర్తించింది. లుంబినీ పార్క్ వద్ద నిమజ్జనం తర్వాత మరింత పెరిగాయి. లేపాక్షి హస్తకళల కేంద్రం వద్ద నిమజ్జన సమయంలో నమోదైన స్థాయిలోనే కొనసాగిందని పీసీబీ నాణ్యత పరీక్షల్లో వెల్లడైంది.

బీజేపీ నేతలకు సునీల్ బన్సాల్ క్లాస్

హైదరాబాద్, అక్టోబరు 31 : తెలంగాణ బీజేపీ నేతలకు ఆ రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ సునీల్ బన్సాల్ క్లాస్ తీసుకున్నారు అని అంటున్నారు. ఆయన ఈ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి హైదరాబాద్ వచ్చారు. వచ్చిన వెంటనే ఆయన తెలంగాణకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు ఇతర నాయకులతో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో పార్టీ పనితీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగైతే కష్టం అని కూడా చెప్పేశారు. తాను ఇక మీదట పూర్తిగా తెలంగాణలోనే ఉంటానని అని కూడా స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ నేతల తీరు మారాల్సిందే అని ఆదేశించారు. నాయకులు అంతా హైదరాబాద్ లో ఉంటే పార్టీ ఎలా పటిష్టం అవుతుంది అని సునీల్ బన్సాల్ ప్రశ్నించారు. నిరంతరం ప్రజలతో వారు ఉండాలని పార్టీని బలోపేతం చేయాలని ఆయన గట్టిగానే కోరారు. అంతే కాకుండా రాష్ట్ర స్థాయి నాయకులు కేవలం రాజధాని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలలో పర్యటించాలని, అలాగే గ్రౌండ్ లెవెల్ దాకా వెళ్ళి పార్టీ శ్రేణులతో మమేకం కావాలని ఆయన కోరారు. ప్రజలతో ఉంటేనే పార్టీ బలోపేతం అవుతుందని ఆయన స్పష్టంగా ఒక సందేశం వినిపించారు. బీజేపీ నేతలు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలి అంటే తాము పార్టీ పదవుల వదిలి తన సొంత నియోజకవర్గాలకు వెళ్లాలని కూడా ఆయన సూచించారు. అలా నిర్ణయించుకున్న వారు ఒకటే రూల్ అని కూడా చెప్పేశారు. వారు ప్రస్తుతం తాము నిర్వహిస్తున్న పార్టీ బాధ్యతలకు పదవులకు ముందుగా రాజీనామా చేయాలని సునీల్ బన్సాల్ ఆదేశించడం విశేషం. పార్టీ పదవా లేక ఎన్నికల్లో పోటీనా ఏదో ఒకటి నిర్ణయించుకోవాలని ఆయన సూచించారు. పార్టీలో పనిచేసే వారికే పదవులు అని ఆయన కచ్చితంగా చెప్పారు. అలా ఎవరైనా పని చేయకపోతే పదవుల నుంచి తప్పుకోండి అని కూడా సూచించారు. పార్టీ నియమించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించని వారు క్షేత్రస్థాయిలో పని చేయలేని వారు వెంటనే తమ పదవుల నుంచి స్వచ్ఛందంగా తప్పుకోవాలని లేదంటే తామే బాధ్యతల నుంచి తప్పిస్తామని సునీల్ బన్సాల్ హెచ్చరించడం గమనార్హం. ఆఫీసులలో కూర్చుంటామంటే కుదరదని గ్రౌండ్ లెవెల్ లో పార్టీ కోసం పనిచేసే నాయకులే కావాలని ఆయన తేల్చేశారు. ఎవరైతే క్షేత్రస్థాయిలో కష్టపడతారో వారికి అవకాశం కల్పించడమే తమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఇక తెలంగాణలో రానున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేసే వ్యూహంలో భాగంగానే సునీల్ బన్సాల్ ఈ కీలక సమావేశం నిర్వహించారు. ఇక మీదట తెలంగాణా విషయంలో పూర్తి ఫోకస్ ని కేంద్ర బీజేపీ నాయకత్వం పెడుతుందని అంటున్నారు. కేంద్ర నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ హోంమంత్రి అమిత్ షా కూడా వరస పర్యటనలు తెలంగాణలో చేస్తారు అని అంటున్నారు. డిసెంబర్ నెలలో మోడీతో వరంగల్ లో భారీ బహిరంగ సభకు కూడా ప్లాన్ చేస్తున్నారు. దక్షిణాదికి గేట్ వేగా తెలంగాణను భావిస్తున్న బీజేపీ నేతలు 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుంచే పక్కా ప్లాన్ తో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే తెలంగాణా బీజేపీని యాక్టివ్ మోడ్ లో ఉంచాలని చూస్తున్నారు అని అంటున్నారు.

37 ఏళ్ల పోలీసు సేవలకు వీడ్కోలు

ఏఎస్ఐ అబ్దుల్ జలీల్‌కు సత్కారం

కుటుంబంతో ప్రశాంత జీవితం గడపాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు తమ వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని సైతం పక్కనపెట్టి విధులు నిర్వర్తిస్తారని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. పోలీస్ శాఖలో 37 ఏళ్ల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ మొహాద్ అబ్దుల్ జలీల్‌ను శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ఆయన ఘనంగా సత్కరించారు. పూలమాల వేసి, శాలువా కప్పి జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో పోలీసు అధికారులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ ప్రజల రక్షణ కోసం పనిచేస్తారని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన పోలీసుల కృషి మరువలేనిదని అన్నారు. పదవీ విరమణ పొందిన వారి అనుభవం, నిబద్ధత తదుపరి తరాల సిబ్బందికి మార్గదర్శకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతల నుంచి విరమణ పొందిన తర్వాత కుటుంబానికి సమయం కేటాయించాలని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా రోజువారీ వ్యాయామం లేదా యోగా అలవాటు చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతూ ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించాలని అబ్దుల్ జలీల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐలు శేఖర్, మల్లేశం, రమేష్, సీసీ సందీప్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నవీన్, పదవీ విరమణ పొందిన అధికారి కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

ధర్మపురి, అక్టోబర్ 31, (ది క్రైమ్ న్యూస్) : ధర్మపురి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో శనివారం తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ధర్మపురి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు మంత్రి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా, అదే రోజున అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేయడం ఎంతో గొప్ప విషయమని ఆయన అన్నారు. పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు ఆత్మగౌరవంతో కూడిన జీవనం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అడ్లూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్ అధికారులు, సర్పంచులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

ధర్మపురి, అక్టోబర్ 31, (ది క్రైమ్ న్యూస్) : ధర్మపురి క్యాంపు కార్యాలయంలో స్వర్గీయ ఇందిరా గాంధీ గారి వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ దేశ తొలి మహిళా ప్రధానిగా ఇందిరా గాంధీ దేశ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేశారని అన్నారు. దేశ సమగ్రత, ఐక్యతను కాపాడేందుకు ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాయని తెలిపారు. ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి అడ్లూరి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘునపట్ల దినేష్, మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బాలగౌడ్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల రాజేష్ పట్టణ అధ్యక్షులు రాజేష్, మరియు కౌన్సిలర్లు, సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై 11 పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు

- 2,664 మంది విద్యార్థులకు బాలల రక్షణ చట్టంపై అవగాహన

మేడ్చల్, అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్) : పిల్లలపై జరిగే లైంగిక నేరాల నివారణ, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు ఆదేశాల మేరకు 2012 నాటి బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో)పై 11 పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు విద్యార్థులకు పోక్సో చట్టంతో పాటు మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆల్వాల్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కుటుంబ న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి రాచపూడి శ్రీదేవి 260 మంది విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. నాగోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు కుటుంబ న్యాయమూర్తి కె. ఉమాదేవి 160 మంది విద్యార్థులకు చట్టంలోని అంశాలను వివరించారు. మచ్చబొల్లారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండో అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్. అమరావతి 254 మంది విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు జీవిత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. పీర్జాదిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి సట్టు రవీందర్ 280 మంది విద్యార్థులకు చట్టంపై వివరించారు. నాచారంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక 300 మంది విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కల్పించారు. యాప్రాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో అదనపు న్యాయమూర్తి పి. సరళ రేఖ 323 మంది విద్యార్థులకు పోక్సో చట్టంపై వివరించారు. వీటితో పాటు కీసరలోని కాకతీయ హైస్కూల్, నాగారంలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్, కాప్రా పరిధిలోని జవహర్‌నగర్ పయనీర్ హైస్కూల్, యాప్రాల్‌లోని ప్రైజ్ హైస్కూల్‌లోనూ విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నాలుగు పాఠశాలల్లో కలిపి 737 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 11 పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో 2,664 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో న్యాయమూర్తులతో పాటు న్యాయస్థాన సిబ్బంది, పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, న్యాయ సహాయ న్యాయవాదులు, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు ఎస్.డి. రాకేష్, ఫీబా పాల్గొన్నారు.

ఎండీఎంఏ మత్తు పదార్థాల అక్రమ రవాణా.. ఒకరి అరెస్ట్

210 గ్రాముల మత్తు పదార్థం స్వాధీనం.. బాలుడు అదుపులోకి

మేడ్చల్, అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్) : నిషేధిత ఎండీఎంఏ మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తూ విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరిని నాచారం పోలీసులు పట్టుకున్నారు. వారిలో ఒకరిని అరెస్ట్ చేయగా, మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 210 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థంతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నాచారం పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎన్. భాస్కర్‌కు అక్టోబర్ 30న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఐడీఏ నాచారం రోడ్ నంబర్ 11లోని ఏఎం గ్రీన్ అమ్మోనియా కంపెనీ సమీపంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 1.40 గంటల సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అజిత్‌కుమార్ రాజక్ (19) వద్ద ఉన్న నల్లటి కవరులో రెండు జిప్‌లాక్ ప్యాకెట్లలో తెల్లటి స్ఫటిక రూపంలో ఉన్న ఎండీఎంఏ మత్తు పదార్థం లభించింది. క్లూస్ బృందం ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా అది ఎండీఎంఏగా గుర్తించారు. పంచ సాక్షుల సమక్షంలో తూకం వేయగా ఒక ప్యాకెట్‌లో 110 గ్రాములు, మరో ప్యాకెట్‌లో 100 గ్రాములు కలిపి మొత్తం 210 గ్రాములు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి ఇన్ఫినిక్స్ ఫోన్, బాలుడి నుంచి రియల్‌మీ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో బెంగళూరుకు చెందిన ఉదయ్ అనే వ్యక్తి ద్వారా గుర్తుతెలియని వ్యక్తి నుంచి మత్తు పదార్థాలను సేకరించినట్లు అజిత్‌కుమార్ తెలిపాడు. వాటిని హైదరాబాద్‌కు తీసుకువచ్చి నాచారం పారిశ్రామిక ప్రాంతంలోని వినియోగదారులకు విక్రయించాలని ఉదయ్ సూచించినట్లు వెల్లడించాడు. అతని సూచనల కోసం వేచి ఉన్న సమయంలో పోలీసులకు పట్టుబడ్డారు. గతంలో తాము కొంత మత్తు పదార్థాన్ని సేవించినట్లు కూడా విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో ప్రధానంగా ఉన్నట్లు అనుమానిస్తున్న ఉదయ్ పరారీలో ఉండటంతో పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. ఇతర సరఫరాదారులు, కొనుగోలుదారుల వివరాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై నాచారం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 612/2026గా ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్లు 22(సి), 8(సి), 29, 27, 27(ఏ), జువైనల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 77 కింద కేసు నమోదు చేశారు. అజిత్‌కుమార్‌ను అక్టోబర్ 30న అరెస్ట్ చేసి అక్టోబర్ 31న న్యాయస్థానంలో హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు. బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని నాచారం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా పాఠశాలల్లో న్యాయ అవగాహన శిబిరాలు

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 31: బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై లైంగిక నేరాల నివారణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టి ఎస్ ఎల్ ఎస్ ఏ) ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డి ఎల్ ఎస్ ఏ) 'సురక్షిత్ బచ్పన్ అభియాన్'లో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించింది. 2026 అక్టోబర్ 26 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఖమ్మం యూనిట్‌కు చెందిన న్యాయాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం, 2012 (ూాజూాూమ్)పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సివిల్ జడ్జి శ్రీమతి కె. జ్యోతిర్మయి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బి. రజిని, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీ ఎ. ప్రవీణ్, నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బి. నాగలక్ష్మి వివిధ పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మనస కూడా ఈ కార్యక్రమంలో భాగంగా బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టంలోని ముఖ్యమైన నిబంధనలు, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, లైంగిక వేధింపులను గుర్తించడం, వాటి నుంచి రక్షణ పొందేందుకు అందుబాటులో ఉన్న చట్టపరమైన మార్గాల గురించి వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని కూడా విద్యార్థులకు వివరించారు. శ్రీమతి పి. దేవి మనస మాట్లాడుతూ, బాలలపై నేరాలను నిరోధించడంలో చట్టాలపై అవగాహన కీలకమని, ప్రతి బాలుడు, బాలిక తమ హక్కులను తెలుసుకుని సురక్షిత వాతావరణంలో విద్యను అభ్యసించేలా చూడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలల రక్షణకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి అవసరమైన న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' ద్వారా పాఠశాల స్థాయిలోనే బాలలకు చట్టపరమైన అవగాహన కల్పిస్తూ, బాలలపై నేరాల నివారణకు అవసరమైన చైతన్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

అమరవీరుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

-1 నుంచి 9 వరకు అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలి.

- సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 31 (ది క్రైమ్ న్యూస్) : భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటాల్లో ప్రాణాలర్పించిన కమ్యూనిస్టు విప్లవ అమరవీరుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్న పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు, ప్రజాసంఘాలకు సూచించారు. భారత విప్లవోద్యమ చరిత్రలో నవంబర్ నెలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఈ నెలలోనే అనేకమంది అగ్రశ్రేణి కమ్యూనిస్టు విప్లవ నాయకులు, కార్యకర్తలు ప్రజా విముక్తి పోరాటాల్లో ప్రాణాలర్పించారని అశోకన్న పేర్కొన్నారు. అందుకే ప్రతి సంవత్సరం నవంబర్ మొదటి వారంలో అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహిస్తూ వారి త్యాగాలను స్మరించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. నక్సల్బరీ వసంత మేఘ గర్జన భారత విప్లవోద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని, మార్క్సిజం-లెనినిజం ముసుగులో కొనసాగిన రివిజనిస్టు, నయా రివిజనిస్టు రాజకీయాలను ప్రశ్నిస్తూ సాయుధ పోరాట పంథాను దేశ రాజకీయ ఎజెండాపైకి తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు. వర్గ పోరాటాలకు బదులుగా పార్లమెంటరీ రాజకీయాలను ముందుకు తెచ్చిన రివిజనిస్టు విధానాలను తిరస్కరిస్తూ, దున్నేవాడికే భూమి అనే నినాదంతో వ్యవసాయ విప్లవ పంథాను ముందుకు తీసుకెళ్లిందని వివరించారు. భారత ప్రజల విముక్తికి నూతన ప్రజాస్వామిక విప్లవమే మార్గమని నక్సల్బరీ ఉద్యమం చాటిచెప్పిందని అన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు రోజురోజుకూ పెరుగుతున్నాయని అశోకన్న ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయని, మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారని విమర్శించారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా దేశాన్ని తీర్చిదిద్దుతామని పాలకులు గొప్పలు చెబుతున్నప్పటికీ, పేదరికం, ఆకలి సమస్యలు కొనసాగుతుండటం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశ సంపదను, ఖనిజ వనరులను ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలను మరింత వేగవంతం చేస్తోందని విమర్శించారు. అటవీ సంరక్షణ నియమాల పేరుతో ఆదివాసీలను వారి సాంప్రదాయ నివాస ప్రాంతాల నుంచి దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆదివాసీల హక్కులు, జీవనాధారాలు, అటవీ వనరుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ పోరాటాలు పీడిత ప్రజల హక్కుల పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయని అశోకన్న పేర్కొన్నారు. సామ్రాజ్యవాద, కార్పొరేట్ అనుకూల విధానాలకు, బడా భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ప్రజాస్వామిక హక్కులు, జీవనోపాధి, సామాజిక న్యాయం కోసం ప్రజలు ఐక్యంగా ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలు సాగించాలని అన్నారు. నూతన ప్రజాస్వామిక మార్పును కోరుకునే విప్లవకారులు, ప్రజాసంఘాలు, మేధావులు, కమ్యూనిస్టు శక్తులు ప్రజా సమస్యలపై ఐక్య కార్యాచరణకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను కేవలం స్మరించుకోవడమే కాకుండా వారు ముందుకు తెచ్చిన ప్రజా సమస్యలు, భూమి, భుక్తి, విముక్తి ఆకాంక్షలపై ప్రజల్లో చైతన్యం కల్పించడమే వారికి అందించే నిజమైన నివాళి అని అశోకన్న పేర్కొన్నారు.

రక్తదానం చెయ్యడం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలి.

మహేశ్వరం డివిజన్ డిసిపి, నారాయణరెడ్డి.

మహేశ్వరం అక్టోబరు 31 (ది క్రైమ్ న్యూస్) : రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని మహేశ్వరం డివిజన్ డిసిపి కె నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మహేశ్వరం, కందుకూరు పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి ఆదేశాల మేరకు మహేశ్వరం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసేందుకు సుమారు రెండు వేల మంది హాజరుకాగా, వారిలో 680, యూనిట్ల రక్తాన్ని విజయవంతంగా సేకరించారు. ఈ సందర్భంగా మహేశ్వరం ఎస్‌హెచ్‌ఓ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించామని, చివరి రోజున చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన రక్తదాతలు, వివిధ గ్రామాల సర్పంచులు, రాజకీయ నాయకులు, స్థానిక పరిశ్రమల ఉద్యోగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రాలు అందజేసి, వారితో సెల్ఫీలు దిగుతూ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి జానకి రెడ్డి కందుకూరు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు మారయ్య, ప్రసాద్, ధనుంజయ్, ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్, మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఇంట్లో మంట పెట్టనున్న ఎల్ నినో!

ఎల్ నినో. ఇపుడు ఈ పదమే భయపెడుతోంది. ఇప్పటిదాకా చూసిన ఎల్ నినో అన్నది ఒక ట్రైలర్ అయితే రానున్న ఆరేడు నెలలలో వచ్చేది సూపర్ ఎల్ నినో అంటున్నారు. అది అత్యంత భయంకరంగా ఉండబోతోంది అని చెబుతున్నారు. ఏకంగా ప్రతీ ఇంట్లో మంట పెట్టనుంది అని అంచనా వేసి మరీ చెబుతున్నారు. పొయ్యి కింద పొయ్యి మీద రెండింటికీ కలిపి ఒకేసారి కరవు తీసుకుని వచ్చే పవర్ ఫుల్ సూపర్ ఎల్ నినోని దేశం చూస్తోంది. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలలో దీని ప్రభావం అత్యధికం అని చెబుతున్నారు. మరి ఇంతలా ఎల్ నినో వచ్చి మీద పడితే ఏమి చేయాలి అంటే చేయాల్సిన విధంగా పొదుపు చర్యలు ఎవరి మటుకు వారు పాటిస్తే తక్కువ నష్టంతో కష్టం తో బయటపడతామని దీని గురించి అంచనా వేస్తున్న వారంతా చెబుతున్నారు ఎల్ నినోతో పాటే వెంట వచ్చేవి నీటి కొరత, అలాగే అధిక వేడిమి, నిత్యావసర ధరలు భారీగా పెరుగుదల. ఇక ఒకదానితో ఒకటి లింక్ అయి ఉన్న ప్రతీ వస్తువూ ఎల్ నినో తో తీవ్రమైన ప్రభావమే చూపిస్తుంది అంటున్నారు. ముందుగా నీటి కొరత అయితే పట్టి పీడిస్తుంది అని అంటున్నారు. భూగర్భ జలాలు దారుణంగా పడిపోవడంతో తాగేందుకు కూడా నీరు ఉండని దారుణమైన పరిస్థితులను అంతా చూడబోతున్నారు అని చెబుతున్నారు. మరి ఈ సమయంలో ఏమి చేయాలి అంటే ఉన్న నీటిని ఇప్పటి నుంచే జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలి. రెండు చెంబులు వాడాల్సిన చోట ఒక చెంబు వాడాలి. అలాగే పారబోయడం, నీటిని వృధా చేయడం అసలు చేయరాదు అని అంటున్నారు. ఇక తాగేందుకే నీటి కొరత ఉంటే పంటలకు ఎలా అన్నది పెద్ద ప్రశ్న. అలా పంటలు కూడా పూర్తిగా పండని స్థితి ఉంటుంది. దాంతో అందరూ తినే బియ్యానికి కూడా ఎక్కువగా కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావం అని చూపిస్తూ బియ్యం ధరలను ఎక్కడికక్కడ పెంచేస్తున్నారు. రానున్న ఆరు నెలలలో వీటి ధరలు ఇంకా ఎక్కువగా పెరగవచ్చు అని అంటున్నారు. దాంతో అన్నం ముద్ద ప్రతీదీ ఇపుడు అత్యంత విలువ కాబోతోంది. అనవసరంగా అన్నం పారేయడం అయితే చేయవద్దు అన్నది పెద్దల మాట. ఉన్న ముద్దను జగ్రత్తగా వాడుకోవడం మరో మంచి మాట. నిత్యావసరాలు అన్నీ కేవలం బియ్యం మాత్రమే కాకుండా నిత్యావసరాలు అన్నీ కూడా అత్యధిక ధరలు పలుకుతాయి. అది సామాన్యుడు కొనలేని స్థితికి వెళ్ళిపోతాయని అంటున్నారు. పప్పుల నుంచి వంట నూనెల నుంచి ఉల్లిపాయలు, చింతపండు, వంట గ్యాస్ నుంచి అన్నీ కూడా ఆకాశాన్ని అంటేలా ధరలు పెరిగిపోతాయని అంటున్నారు. ఇక కూరగాయల ధరలు ఇప్పటికే మార్కెట్ లో అదిరిపోతున్నాయి. ఇవి ఇంకా పెరిగి కిలో వంద రూపాయలు పై దాటినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. విద్యుత్ కొరత : విద్యుత్ అన్నది ఎలా తయారవుతుంది అంటే నీటి నుంచే ఎక్కువ అన్నది తెలిసిందే. పైగా ఇది చవక అయినది కూడా. మరి నీరే లేని చోట విద్యుత్ ఉత్పత్తి భారీగా తగ్గిపోతుంది. దాంతో తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడుతుంది అని అంటున్నారు. అందుకే ఇప్పటి నుంచే కరెంట్ ని కూడా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా ఫ్యాన్లు ఏసీలు లైట్లూ వేసి వృధా చేస్తే రేపటి రోజున విద్యుత్ ఉండని నేపథ్యం ఉంటుంది. వస్తుంది కదా కరెంట్ అని ఈ రోజు ఖర్చు చేయడం కాదు తగ్గిస్తే అదే రేపటికి మనకు వెలుగు ఇస్తుంది అన్నది గుర్తెరగాలి. ఇక సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనవసర ఖర్చులను అదుపు చేయాలని సూచిస్తున్నారు. వేయి రూపాయలు ఖర్చు చేయాల్సిన చోట అయిదు వందలకే పరిమితం కావాలి. విలాసం ఏదో అవసరం ఏదో గుర్తించి ఆ విధంగా మసలుకోవాలని అంటున్నారు. ఎందుకంటే పెరిగే ధరలతో డబ్బు విలువ అమాంతం పడిపోతుంది. వందకు వచ్చేది రెండు వందలకు ఎగబాక వచ్చు. అపుడు నిత్యావసరాలకే ఎక్కువ బడ్జెట్ అవుతుంది. కాబట్టి చేతిలో డబ్బు ఉంచుకోవాలి. అది ప్రాణప్రదంగా ఖర్చు చేయాలని సూచిస్తున్నారు. అయితే సూపర్ ఎల్ నినో అని భయపడి వణికిపోయి ఇప్పుడే మొత్తం సరుకులు అన్నీ కొనేసి ఇంట్లో వేసుకున్నా కూడా అది కూడా తప్పే అవుతుంది. ఎందుకంటే డిమాండ్ అండ్ సప్లై చైన్ తో సాగే ప్రపంచంలో ఈ విధంగా తొందర పడితే మరింతగా ధరలు పెరిగి ఆ ప్రభావం ఇతర వస్తువుల మీద కూడా పడుతుంది. అందువల్ల జాగ్రత్తగా వ్యవహరిస్తే చాలు, అందరూ సూపర్ ఎల్ నినోని తట్టుకుని బయటపడతారని అంటున్నారు. వచ్చే ఆరు నెలలు గడిస్తే మాత్రం మంచి రోజులు వచ్చినట్లే అని అంటున్నారు. తస్మాత్ జాగ్రత్త.

'సర్' లోపాలపై సుప్రీం అసహనం

ఎట్టకేలకు కోట్లాదిమంది ఓటర్లు, లక్షలాదిమంది యువత, ప్రతిపక్షపార్టీలు గత ఏడాదికిపైగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లోని అవకతవకలపై చేస్తున్న న్యాయపోరాటం సుప్రీం కోర్టు పరిగణనలోకి రావడం చెప్పుకోదగిన అంశం. ఈ ప్రక్రియ అన్యాయమైనది, చట్టవిరుద్ధమైనది, రాజ్యాంగ విరుద్ధమైనది, ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమైనదని ఓటర్లు, యువత, ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. సుప్రీం కోర్టు ఇదే విధంగా ముందుగానే స్పందించి ఉంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్న వారికి ఎదురైన ఎన్నో ఇబ్బందులు, అనవసరమైన బాధలు తప్పి ఉండేవి. అంతేకాకుండా ఈ కాలంలో జరిగిన ఎన్నికలు ప్రజల నిజమైన అభిప్రాయాన్ని, వారు తమ పాలకులుగా ఎవరిని ఎన్నుకోవాలనుకుంటున్నారో వారి నిర్ణయాలను మరింత కచ్చితంగా ప్రతిబింబించి ఉండేవి. ఢిల్లీలో చేపట్టిన 'సర్' ప్రక్రియకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎన్నికల సంఘాన్ని కొన్ని కీలక ప్రశ్నలు అడిగింది. ఇప్పటికే ఓటరుగా నమోదైన వ్యక్తి ఏ కారణం చేతనో ఎన్యుమరేషన్ ఫారాన్ని తిరిగి ఎన్నికల సంఘానికి సమర్పించకపోతే అతని ఓటు హక్కును శాశ్వతంగా రద్దు చేస్తారా? ఓటరు జాబితా నుంచి తొలగించిన వ్యక్తులను మళ్లీ ఫారం 6 నింపి కొత్త ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని కోరడం తప్పు కాదా? ఎవరైనా ఓటరు తన నివాసం చిరునామా మార్చుకుంటే ఆ కొత్త చిరునామా వివరాలను మాత్రమే తెలియజేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? ఎన్యూమరేషన్ ఫారాలను సమయానికి సమర్పించలేదని ఓటర్ల జాబితానుంచి తొలగించబడిన వ్యక్తులు, ఆ తర్వాత అదే ఫారాలను సమర్పించే అవకాశం ఎందుకు కల్పించకూడదు? అని అభ్యంతరాలు లేవదీసింది. ఎఐటియుసి అలాగే చట్టం నిర్దేశించిన పరిధిని మించి ఫారం6 లో మార్పులు చేయడానికి ఎన్నికల సంఘానికి ఏ అధికారం ఉందని నిలదీసింది. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, ఢిల్లీ లోని మొత్తం 1.45 కోట్ల మంది ఓటర్లలో సుమారు 47లక్షల మంది పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితానుంచి తొలగించబడ్డాయి. ఈ 47లక్షల మంది ఓటర్లను తిరిగి సంప్రదించేందుకు, వారి వివరాలను నిర్ధారించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) విధానంలో లోపం ఏమిటంటే ఓటర్ల నమోదు బాధ్యతను ప్రభుత్వం నుంచి ఓటర్ల బాధ్యతగా మార్చడం. ఒక వ్యక్తి కేవలం నివాసం మాత్రమే మార్చుకున్నా ఓటర్ల జాబితానుంచి అతని పేరును తొలగించేస్తున్నారు. బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితానుంచి తొలగించిన పేర్లలో 55% మంది 'చిరునామా మార్చుకున్నారు', లేదా 'అందుబాటులో లేరు' అనే కారణాలతో తొలగించబడ్డారు. ఈ పరిస్థితి సర్ మూడో దశలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 72 శాతానికి పెరిగింది. ఇవే కారణాలతో కర్ణాటకలో సుమారు 84లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. అయితే అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దశలో కొత్త ఓటర్లతో కలిపి నికరంగా కేవలం 8.2లక్షల మందిని మాత్రమే జాబితాలో తిరిగి చేర్చారు. నివాసం మార్చుకున్న ఓటర్లను కొత్త ఓటర్లుగా మళ్లీ దరఖాస్తు చేసుకోమని కోరడం వల్ల ఎన్నికల సంఘం చారిత్రాత్మక లక్ష్యమైన ఓటు హక్కును విస్తరించే విధానం దెబ్బతింటుంది. 2002 03లో ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఓటర్లు నివాసం మార్చుకుంటే ఆ కొత్త నివాసానికి అధికారులు వెళ్లి అక్కడే ఓటర్లుగా నమోదు చేసేవారు. అదే సమయంలో వారి పాత ఓటరు నమోదు వివరాలను ముఖ్య ఎన్నికల అధికారి సమన్వయం చేసి సరిచూసేవారు. గతంలో ప్రభుత్వం, ఎన్నికల అధికారులు ఓటర్లను గుర్తించి వారి పేర్లను జాబితాలో చేర్చే బాధ్యత తీసుకునేవారు. కానీ ఇప్పుడు సర్ విధానంలో ఓటర్లే తమ పేర్లను తిరిగి నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఓటర్ల అర్హతను వారి కుటుంబ సభ్యుల సంఖ్య లేదా ఓటరుకు, వారి తల్లిదండ్రులకు మధ్య ఉన్న వయస్సు వ్యత్యాసం ఆధారంగా నిర్ణయించాలని ఏ చట్టం లేదా నిబంధన చెప్పడం లేదు. కానీ ఎన్నికల సంఘం ఇలాంటి అంశాల ఆధారంగా కొన్ని అసంబద్ధమైన, కంప్యూటర్ అల్గారిథమ్‌ల ఆధారిత 'తార్కిక వ్యత్యాసాల తనిఖీలను' చేపట్టింది. పశ్చిమబెంగాల్‌లో ఇలాంటి తనిఖీల కారణంగా 22లక్షల మంది ఓటు హక్కును కోల్పోవడం అత్యంత బాధాకరం. వీరంతా తమకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టు ట్రిబ్యునళ్లను ఆశ్రయించారు. అలాగే ఢిల్లీలో ముస్లింలను ఇతరులతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో అనుమానాస్పద ఓటర్లుగా గుర్తించారు. ఓటర్ల అర్హతను నిర్ణయించడానికి ఎన్నికల సంఘం అనుసరిస్తున్న 'తార్కిక వ్యత్యాసాల తనిఖీలకు చట్టబద్ధమైన ఆధారం ఉందా లేదా అనే విషయాన్ని కోర్టు తేల్చాలి. కోర్టు కేవలం ఓటరు నమోదు గడువును పొడిగించడం, ప్రాంతాల వారీ ముద్రించిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించడం వంటి తాత్కాలిక పరిపాలనా పరిష్కారాలను మాత్రమే సూచించకూడదు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. లక్షలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారని ఆరోపణలు ఎదురవుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ఓటు హక్కును కాపాడాలని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై ఇంత తీవ్రమైన దెబ్బకొట్టిన ఎన్నికల సంఘాన్ని, ఆ సంఘాన్ని నిర్వహిస్తున్న బాధ్యులైన అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలన్న అభిప్రాయం ఓటర్లలో కనిపిస్తోంది. అలాగే ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రద్దు చేసి, మొదటి నుంచి మళ్లీ ఈ ప్రకియను ప్రారంభించాలన్న వాదన వినిపిస్తోంది.

రాఘవేంద్రరావు మరదలు, జగపతిబాబు చెల్లెలు..

మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణ

గుంటూరు : గుంటూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణ కుటుంబ నేపథ్యంపై ఆసక్తికర సమాచారం వెలుగుచూసింది. ఆమె విజయాన్ని కాంక్షిస్తూ ఇద్దరు సినీ ప్రముఖులు వీడియో సందేశాలు విడుదల చేశారు. ఆ ఇద్దరూ లక్ష్మి అపర్ణకు దగ్గర బంధువులుగా చెబుతున్నారు. లక్ష్మి అపర్ణను గుంటూరు మేయరుగా గెలిపించాలని దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, ప్రముఖ హీరో జగపతిబాబు ప్రత్యేకంగా వీడియోలు విడుదల చేశారు. రాఘవేంద్రరావు, మేయర్ అభ్యర్థి లక్ష్మి అపర్ణ భర్త కోవెలమూడి రవీంద్ర సోదరులుగా చెబుతున్నారు. అదేవిధంగా లక్ష్మి అపర్ణ తనకు సోదరి అంటూ స్వయంగా జగపతిబాబు వెల్లడించారు. గుంటూరు టీడీపీ నేత, మాజీ మేయర్ రవీంద్ర అలియాస్ నాని రాజకీయాల్లో చాలా సీనియర్. అయినప్పటికీ ఆయన బంధుత్వంపై గుంటూరు వాసులకు తప్ప రాష్ట్రంలో ఇతర ప్రాంతాల వారికి తెలియదు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల పోరులో రవీంద్ర కుటుంబం దిగడంతో ఆయన బంధువులు బయటకు వస్తున్నారు. కోవెలమూడి లక్ష్మి అపర్ణను గెలిపించాలని కోరుతున్నారు. ఇందులో సినీ ప్రముఖులు అయిన రాఘవేంద్రరావు, జగపతిబాబు విడుదల చేసిన వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి గుంటూరు ప్రజలకు విన్నపం నా చెల్లి లక్ష్మి అపర్ణ మేయరుగా పోటీ చేస్తున్నారని జగపతిబాబు విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోందని చెబుతున్నారు. ప్రజలు చాలా తెలివైన వారని, ఎవరిని గెలిపించాలో వారికి బాగా తెలుసు అన్న జగపతిబాబు గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించినట్లుగానే లక్ష్మి అపర్ణను గెలిపించాలని కోరారు. నా చెల్లికి మంచి మనసు ఉంది. సమర్థురాలు అంటూ ఆయన కితాబునిచ్చారు. ఇక జగపతిబాబు చెల్లెలుగా లక్ష్మి అపర్ణను పరిచయం చేయడంతో వారి మధ్య బంధుత్వంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందిప్రముఖ నిర్మాత వీబీ రాజేంద్రప్రసాద్ కుమారుడైన జగపతిబాబుకు ఇద్దరు సోదరులు మాత్రమే ఉన్నారని సమాచారం. అయితే లక్ష్మి అపర్ణ కుటుంబంతో దగ్గర సంబంధం ఉండటం, బంధుత్వం కారణంగా ఆమె సోదరి అవుతారని అంటున్నారు.

బెజవాడలో త్రిముఖ పోరు

విజయవాడ, అక్టోబరు 31 : ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో నిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయన నిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు తన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యాధికుల ఓటు బ్యాంక్‌ను ఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించ డం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగా మారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు. అయితే, ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంత హుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్ప వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బిసి సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళు తున్నారు. అయితే, ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. నాన్-పొలిటికల్, న్యూట్రల్ ఓటర్లు, మార్పు కోరుకునే వర్గాలు గనక ఏబీవీ వైపు మొగ్గుపడితే కూటమి, వైసీపీ ఓట్ బ్యాంకుల్లో భారీగా గండిపడే అవకాశం ఉంది. బెజవాడ ఓటర్లు ఎప్పుడూ ఊహించని సంచలన తీర్పులకు వేదికగా నిలుస్తారనే చరిత్ర ఉండటంతో, ఏబీవీ గెలుపు అవకాశాలను రాజకీయ విశ్లేషకులు తోసిపుచ్చలేకపోతున్నారు. వంగవీటి రాధా పవర్ కేడర్, రాయన భాగ్యలక్ష్మి పార్టీ క్యాడర్ బలానికి ఎదురీదుతూ ఏబీ వెంకటేశ్వరరావు సృష్టిస్తున్న ఈ ట్రెండ్ బెజవాడ రాజకీయాల్లో కొత్త చరిత్రకు పునాది వేస్తోంది. సంప్రదాయ పార్టీల ధనప్రవాహం, కుల సమీకరణలను దాటుకుని, వామపక్షాల సంపూర్ణ సహకారంతో ఏబీవీ నిజంగానే బెజవాడ పీఠంపై సంచలనం సృష్టిస్తారా లేక కూటమి-వైసీపీల హోరాహోరీ మధ్య స్వతంత్ర హోదాకే పరిమితమవుతారా అనేది పోలింగ్ ఫలితాలు తేల్చనున్నాయి.

అంతటా ఉంది ఆత్మే

'ఆత్మ (భూమా) కింద పైన వెనుక ముందు పక్కల అంతటా నిండి ఉంది. ఈ కనిపించే జగత్తు అంతా ఆత్మే! అదే నేను. నేనే కిందా, పైనా అంతటా ఉన్నాను. అంతా నేనుగా ఉన్నాను' అని పై ఉపనిషత్ వాక్యానికి భావం. ఎంతటి ఉదాత్తమైన భావాన్ని తెలియజేసిందో కదా ఈ శ్లోకం. దీన్ని బలపరిచే కథే ఇది.. మహారాష్ట్రలో పండరీపురం అనే పుణ్యక్షేత్రం ఉన్నది. అక్కడ దైవం పాండురంగ విఠలుడు. ఏడు వందల ఏండ్ల క్రితం అక్కడ ఒక భక్తుడు ఉండేవాడు. చిన్నప్పటినుంచీ అతనికి రంగడంటే ప్రాణం. ఎప్పుడూ స్వామి ధ్యాసలోనే ఉండేవాడు. ఒకరోజు సాయంకాలం అతను ఓ చెట్టుకింద కూర్చొని భోజనం చేస్తున్నాడు. ఎక్కడినుంచో ఒక కుక్క అక్కడికి వచ్చింది. పళ్లెంలోని రొట్టెలను లొట్టలు వేసుకుంటూ చూసింది. భక్తుణ్నీ పరిశీలించింది. ఆ వచ్చిన కుక్కను అతను గమనించలేదు. అది గబుక్కున రొట్టెను నోట కరచుకొని పరుగెత్తింది. పరధ్యానం నుంచి తేరుకున్న ఆ భక్తుడు ఆ కుక్క వెంటపడ్డాడు. 'భగవాన్ కేవలం రొట్టెలు తినకు. కడుపు నొప్పి లేస్తుంది. ఇదిగో ఈ నెయ్యి వేసుకో!' అంటూ కుక్కను పట్టుకున్నాడు. రొట్టె మీద నేతి వేసి కుక్కకు ఇచ్చాడు. అది ఆవురావురుమంటూ తిన్నది. భక్తుడు తృప్తిగా నవ్వాడు. అతనెవరో కాదు పాండురంగనిపై ఎన్నో కీర్తనలు రచించి, పాడి ధన్యుడు అనిపించుకున్న భక్తాగ్రేసరుడు నామదేవ్! ఆత్మ అనంతమైనది. ఆ భూమా తత్వాన్ని అనుభూతిలోకి తెచ్చుకున్న మహాత్ముడు కాబట్టి అతను జంతువుల్లోనూ దైవాన్ని దర్శించాడు. ఈ తత్వంలోని వాళ్లు సర్వజీవులందు ఆత్మ దర్శనం చేస్తారు. అక్కడ కుక్క, పిల్లి అనేవి సామాన్యులకు కనిపిస్తాయి. కానీ, భూమా తత్వంలో స్థిరపడిన వాళ్లు అంతటా తమను తామే దర్శనం చేసుకుంటారు. తాము ఏ విధంగానైతే అనుభూతి చెందుతారో, అవి కూడా అలాగే అనుభూతి చెందుతాయని భావిస్తారు.



ఆధ్యాత్మికం

వైద్యుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

ఎర్రగుంట బస్తీ దవాఖానాలో వైద్యులు లేకపోవడంపై అసంతృప్తి

మేడ్చల్, అక్టోబర్ 31 (ది క్రైమ్ న్యూస్): నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రగుంట బస్తీ దవాఖానాను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానాలో వైద్యులు అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం కోసం దవాఖానాకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడం సరికాదన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. ఎర్రగుంట బస్తీ దవాఖానాలో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, ముఖ్యంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు.

పదవీ విరమణ తర్వాత శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలి

- పదవీ విరమణ పొందిన గౌడ ఆంజనేయులు కి ఘన సన్మానం - ఘన వీడ్కోలు

రామగిరి, అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్) : ప్రతి ఉద్యోగి పదవీ విరమణ సమాజమే అని, పదవి విరమణ పొందిన వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం నాయకులు అన్నారు. పదవీ విరమణ పొందుతున్న పెద్దపెల్లి జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయ అసిస్టెంట్ ఇంజనీర్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం పెద్దపెల్లి జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గౌడ ఆంజనేయులు ని వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన వేదికపై తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం, తోటి ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, కుటుంబ మిత్రులు పుష్పగుచ్చం, శాలువాలతో సన్మానించారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం నాయకులు ఆయనను చేనేత కండువాతో కప్పి, కులదైవం మార్కండేయ స్వామి చిత్రపటంతో పాటు, ఆయన జీవిత భాగస్వామి, కుటుంబ సభ్యులతో ఉన్న ఫోటోలతో, ఉత్తమ ఉద్యోగిగా సన్మానించిన ఫోటోలతో ప్రత్యేకంగా తయారు చేయించిన ఫోటో ఫ్రేమ్ ను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 2022లో పెద్దపెల్లి జిల్లా తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం మొదటి కార్యవర్గ ఏర్పాటులో ఎలక్షన్ అధికారిగా, అనంతరం సహ అధ్యక్షులుగా, అసోసియేట్ ప్రెసిడెంట్ గా కొనసాగుతూ సంఘ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని అందించిన సేవలను కొనియాడారు. 39 సంవత్సరాల ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానంలో ఆయన సంపాదించిన మంచి పేరును గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన శేష జీవితం కుమారులు, కోడళ్లు, మనవలు, మనవరాళ్లు, సతీమణితో కలిసి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని, మార్కండేయ దేవుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి టి. శంకరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్లు బి. రమణారెడ్డి, సిహెచ్. పద్మ భాగ్యలక్ష్మి, ఏఈ ఆంజనేయులు, సీనియర్ అసిస్టెంట్ కె. మనోహర్ రెడ్డి, డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం. శ్రీధర్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, రాష్ట్ర కార్యదర్శి డా. దుబాసి విష్ణుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు బండి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి వేముల సతీష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుడికాల హరీష్, ప్రాథమిక సభ్యులు సబ్బానీ రాజేష్ తదితరులు, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కారులో మంటలు.. ప్రయాణికులు క్షేమం

రంగారెడ్డి : బాటసింగారం గ్రామ పరిధిలోని విజయవాడ జాతీయ రహదారిపై ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద విజయవాడ నుండి హైదరాబాదుకు వస్తున్న హుండై ఐ10 కార్లు అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి . క్షణాల్లో మంటలు కారు మొత్తం వ్యాపించడంతో అది గమనించిన డ్రైవింగ్ చేస్తున్న తాడేపల్లి ప్రవీణ్ వృత్తిరీత్యా ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఏఎస్ఓ కారు ఆపేసాడు. అదృష్ట శాత్తు కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అది గమనించిన స్థానికులు ఫైర్స్ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు.

నవంబర్ 6 తర్వాత కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం

- అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 31: నవంబర్ 6 తర్వాత కూడా వరంగల్ - నల్గొండ - ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందని అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ తో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో మంచి పురోగతి సాధించారని అధికారులను అభినందించారు. అయితే నవంబర్ 6 చివరి తేదీగా భావించి రాజకీయ పార్టీల నుంచి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని, మరోవైపు అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా వేగవంతం కావాల్సి ఉందని అన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఖమ్మం జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఫారం-18 దరఖాస్తుల స్వీకరణతో పాటు వాటి పరిశీలనను వేగవంతం చేయాలని సూచించారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని, అదే తేదీన డిగ్రీ పరీక్షల ఫలితాలు ప్రకటించబడిన వారు కూడా అర్హులేనని తెలిపారు. ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ అందుబాటులో లేని సందర్భాల్లో సంబంధిత విద్యాసంస్థ అధిపతి ధృవీకరించిన సర్టిఫికెట్‌ను కూడా పరిశీలనకు స్వీకరించవచ్చని తెలిపారు. విద్యార్హత ధృవీకరణతో పాటు దరఖాస్తుదారుల సాధారణ నివాస స్థితిని క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్-2026 ప్రక్రియను అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) సమర్థవంతంగా నిర్వహించిన తీరును అభినందించారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం బీఎల్ఓలందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో నివాస ధృవీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు నవంబర్ 6తో ముగిసిపోదని, ఆ తేదీ తర్వాత కూడా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల రూపంలో దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు కూడా ఫారం-18 దరఖాస్తులు సమర్పించవచ్చని, నిబంధనల ప్రకారం వాటిని స్వీకరించడం జరుగుతుందని వివరించారు. ఈ విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, పట్టభద్రులకు, క్షేత్రస్థాయి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. బీఎల్ఓల ప్రధాన బాధ్యత దరఖాస్తుదారుల నివాస స్థితిని క్షేత్రస్థాయిలో ధృవీకరించడమేనని తెలిపారు. ఒకే ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో ఆన్‌లైన్ దరఖాస్తులు రావడం, ఒకే ఐడీ ద్వారా వందల సంఖ్యలో దరఖాస్తులు సమర్పించడం వంటి సందర్భాల్లో ప్రత్యేక అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు. ఒకే ఐడీ ద్వారా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవాలను ధృవీకరించిన తర్వాతే ఆమోదించాలని సూచించారు. అనుమానాస్పద దరఖాస్తుల విషయంలో క్షేత్రస్థాయి విచారణ చేపడుతూనే, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావచ్చనే సానుకూల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఫారం-18 దరఖాస్తుల పరిశీలన అనంతరం పోలింగ్ కేంద్రాల కేటాయింపును కూడా అత్యంత జాగ్రత్తగా ప్రణాళిక రూపొందించి చేపట్టాలని సూచించారు. ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా పోలింగ్ కేంద్రం ఉండే విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని, అవసరమైన జంబో బ్యాలెట్ బాక్సులను ముందుగానే గుర్తించాలని తెలిపారు. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా నేరమని, డబుల్ ఓటు నమోదు చేసుకునే వారిపై శిక్షార్హమైన చర్యలు ఉంటాయనే విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరంగల్--నల్గొండ--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈసారి జిల్లాలో 1.5 లక్షలకు పైగా పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, వారి సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ప్రస్తుత ప్రక్రియలో తప్పని సరిగా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ముఖ్యంగా 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పట్టభద్రులను గుర్తించి, వారికి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు నమోదుకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసేందుకు కాల్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నవంబర్ 6 తర్వాత కూడా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు అవకాశం ఉందనే సమాచారాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి నివాస స్థితినిధృవీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల కేటాయింపును కూడా ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా ముందస్తు ప్రణాళికతో చేపట్టాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఫారం-18 దరఖాస్తుల విచారణ బాధ్యతలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), సీనియర్ అసిస్టెంట్ కేడర్ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అందిన ఫారం-18 దరఖాస్తులను ప్రతిరోజూ డౌన్‌లోడ్ చేసుకొని పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయి అధికారులు బూత్ స్థాయి అధికారుల సహకారంతో దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లను, వారు సంబంధిత ప్రాంతంలో సాధారణ నివాసితులుగా ఉన్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించి విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దరఖాస్తుల కేటాయింపు కోసం 118 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నవంబర్ 6, 2026 వరకు అందే దరఖాస్తుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను నవంబర్ 10, 2026లోగా సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిసెంబర్ 25, 2026లోగా పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం అదనపు కలెక్టర్ డీ. వేణుగోపాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమానికి హాజరైతే సస్పెన్షన్ చేస్తారా?

సేవా కార్యక్రమాలను రాజకీయం చేయొద్దు..

ఎంపీ వంశీకృష్ణకు కాంగ్రెస్ నేతల మద్దతు..

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేపట్టిన సేవా కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ నాయకుడిపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని పలువురు పార్టీ నేతలు తప్పుబట్టారు. సేవా కార్యక్రమాలను రాజకీయాలకు ఆపాదించడం, వాటిలో పాల్గొన్న నాయకులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం సరికాదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో మంత్రి జోక్యం చేసుకొని సస్పెన్షన్ నిర్ణయాన్ని పునఃపరిశీలించేలా చూడాలని కోరారు. శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రామగిరి మండల పర్యటనలో భాగంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొయ్యూరు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, బెంచీలు పంపిణీ చేశారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఐతే ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు శుభవంశీపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడంతో పాటు పార్టీ పరంగా లేఖలు జారీ చేయడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ చేపట్టిన విద్యా సేవా కార్యక్రమాన్ని అభినందించాల్సింది పోయి, అందులో పాల్గొన్న నాయకులపై చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజా సేవకు రాజకీయ భేదాలను ఆపాదించకుండా, ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఐటీ శాఖ మంత్రి, పెద్దపల్లి ఎమ్మెల్యే, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, గోదావరిఖని ఎమ్మెల్యే తదితర నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. పార్టీ ఐక్యతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన తరుణంలో నాయకులపై చర్యలు తీసుకోవడం విభేదాలకు దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. మంత్రి ఈ అంశంపై దృష్టి సారించి, పార్టీ నాయకులపై తీసుకున్న సస్పెన్షన్ చర్యలను వెనక్కి తీసుకునేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దళిత, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు సమన్వయంతో ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సేవా కార్యక్రమాలకు పార్టీలకతీతంగా మద్దతు ఇవ్వాలని, అనవసర విభేదాలకు తావివ్వకుండా కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహనీయుల ఆశయ సాధన సంఘం నాయకుడు బొంకూర్ కైలాసం, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు కుక్క చంద్రమౌళి, మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సజ్జాద్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్, మాజీ ఎంపీటీసీ మాటూరి రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పలకల సాగర్ రెడ్డి, పిట్టల రాజు, వార్డు సభ్యుడు పల్లె ప్రశాంత్, కొల అనిల్, తాజుద్దీన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ బ్రిడ్జితో ప్రయాణికుల ప్రాణాలకు ముప్పే.

గతంలోనే అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోని వైనం.



మహేశ్వరం అక్టోబరు 31 (ది క్రైమ్ న్యూస్), :ఇనుప రాడ్లు తేలి ప్రమాదకరంగా మారి ప్రయాణికుల పాలిట ఈ బ్రిడ్జి శాపంగా మారింది. నిత్యం ఎవరో ఒకరు కింద పడి తీవ్ర గాయాల పాలవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే కందుకూరు మండల పరిధిలోని పులిమామిడి మహేశ్వరం రహదారి కేకే బస్తి సమీపంలో ఉన్న బ్రిడ్జి గత రెండు సంవత్సరాల నుండి రహదారిపై బ్రిడ్జి సమానంగా లేకపోవడంతో పాటు బ్రిడ్జికి ఇనుప రాడ్లు తేలి ప్రమాదకరంగా మారిన సంబంధించిన అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రాత్రి మురళి నగర్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు మహేశ్వర నుండి మురళి నగర్ వెళ్లే క్రమంలో ఇదే బ్రిడ్జిపై కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మత్తులు చేసి ప్రయాణికులకు మెరుగైన ప్రయాణాన్ని కల్పించాలని కందుకూరు మహేశ్వరం మండలాల ప్రజలు కోరుతున్నారు.

టీఆర్ఎస్ కార్మిక విభాగం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా బోంగోని శంకరయ్య గౌడ్...

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ కార్మిక విభాగం పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఇందులో భాగంగా జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడిగా బోంగోని శంకరయ్య గౌడ్‌ను నియమించారు.ఈ నియామకాన్ని పురస్కరించుకుని శనివారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షురాలు సిరవేన స్వప్న ముదిరాజ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వప్న ముదిరాజ్ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహుజన వాదానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని కులాలు, వర్గాలకు రాజకీయాల్లో సముచిత గుర్తింపు, అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. బీసీ సామాజిక వర్గాలతో పాటు మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. తనకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రకటించిన ఐదు పాంచజన్యాలైన ఉచిత విద్య, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక న్యాయంతో పాటు రైతు భరోసా, భూమిలేని నిర్వాసితులకు 'భూలక్ష్మి' పథకం ద్వారా భూమి అందించాలనే లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వెల్లడించారు. మహిళలకు రాజకీయాల్లో ప్రాధాన్యతనిస్తూ నాయకత్వ అవకాశాలు కల్పించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. అన్ని కులాలు, వర్గాల ప్రజలు ఐక్యంగా పార్టీతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శైలేంద్ర కొమురయ్య యాదవ్ మాట్లాడుతూ.. బోంగోని శంకరయ్య గౌడ్‌కు కార్మిక రంగంపై మంచి అవగాహన ఉందని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ వారి పక్షాన నిలిచే వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు. కార్మిక రంగంలో అనుభవం కలిగిన బీసీ నాయకుడికి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీ వివిధ అనుబంధ విభాగాల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తూ నాయకత్వ అవకాశాలు అందిస్తోందని పేర్కొన్నారు. బీసీ యువత, బడుగు బలహీన వర్గాల నాయకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సీనియర్ నాయకులు ఉస్తేమ్ శ్రీనివాస్ ముదిరాజ్, మల్యాల కరుణాకర్, గుర్రం శ్రీనివాస్, కారుపాకల రమేష్, కందుకూరి సురేష్, బండిగే మహేష్ గౌడ్, కాల్వల రవీందర్, వాసవి, గాజుల సదయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన బోంగోని శంకరయ్య గౌడ్‌కు నాయకులు అభినందనలు తెలిపి, జిల్లాలో కార్మిక విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.

దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించు టకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అన్నారు. శనివారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ వల్లభాయ్ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు.ఈసందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు, మాట్లాడుతూ జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించు కుంటున్నామని తెలిపారు.దేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని, దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు అందిస్తామని, ఉద్యోగులతో అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పేరిట కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు...

ఎన్నికల సంఘం, ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ చేస్తున్న అనవసర రాద్ధాంతమే..

బిజెపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి..

కరీంనగర్ టౌన్, అక్టోబర్31(ది క్రైమ్ న్యూస్) : ఓటమి భయంతో అలమటిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ఉనికిని చాటుకోవడానికే నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిరసన రాజకీయ డ్రామా మొదలుపెట్టిందని , రాజ్యాంగ పరిరక్షణ పేరిట , ఎన్నికల సంఘం , ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ చేస్తున్నది అనవసర రాద్ధాంతమేనని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఘాటుగా విమర్శించారు. నంబర్ 5న కరీంనగర్లో తలపెట్టిన మహా పాదయాత్రకు సంబంధించి కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వివిధ మండలాల మహిళా మోర్చా అధ్యక్షులు, మహిళా ప్రజా ప్రతినిధులు , ముఖ్య నేతల తో సన్నాక సమావేశం కరీంనగర్ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుర్రాల నిర్మలరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని అతిధి హోటల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ స్వతంత్ర రాజ్యాంగ సంస్థలైన కేంద్ర ఎన్నికల సంఘం పై బురదజల్లుతూ, రాజ్యాంగం ప్రమాదంలో ఉందనే నిరాధార ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా నవంబర్ 1న ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో తలపెట్టిన నిరసన కార్యక్రమం రాహుల్ గాంధీ బాధ్యతారాహిత్య వైఖరి, ఆయన రాజకీయ దురుద్దేశాన్ని స్పష్టంగా తెలియజేస్తుందన్నారు "పోలీసులకు, లాఠీలకు భయపడకండి" అంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న రాహుల్ గాంధీ ప్రజలను, కార్యకర్తలను రెచ్చగొట్టడం ఉసికొల్పేలా మాట్లాడటమే కాంగ్రెస్ స్వార్థ రాజకీయాలకు నిదర్శనమన్నారు.బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, మేయర్ కొలగని శ్రీనివాస్ , రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, మాజీ జెడ్పీ చైర్మన్ కనుమల్ల విజయ లు మాట్లాడుతూప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టను దిగజార్చేందుకు "ఓట్ల చోరీ", ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా రాజ్యాంగ వ్యవస్థల పట్ల కాంగ్రెస్‌కు ఉన్న అపనమ్మకాన్ని మళ్లీ బయటపెట్టుకుందన్నారు. చట్టబద్ధమైన సవరణలకు, ఈవీఎం సంస్కరణలకు చట్టసభల్లో చర్చించాల్సిన విపక్షం, వీధుల్లో నిరసనలు చేస్తూ అశాంతిని సృష్టించడానికి ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. పండుగల సీజన్ కొనసాగుతున్న సమయంలో రామ్‌లీలా మైదానంలో 10 లక్షల మందితో భారీ ర్యాలీ నిర్వహించడం వల్ల పాత, కొత్త ఢిల్లీ వ్యాపారాలు దెబ్బతింటాయని, రద్దీతో కోట్లాది రూపాయల వ్యాపారం నిలిచిపోతుందని ఢిల్లీ వ్యాపార సంఘాలు సోనియా గాంధీకి లేఖ రాసినప్పటికీ కాంగ్రెస్ స్పందించకపోవడం దారుణమని, ప్రజల, వ్యాపారుల శ్రేయస్సు కంటే తమ రాజకీయ లబ్ధే ముఖ్యాంశమని కాంగ్రెస్ నిరూపించిందనే విషయం దీంతో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. దేశంలో కాంగ్రెస్ పూర్తిగా ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, ఇటీవల పలు రాష్ట్రాల్లో బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కు చెంపపెట్టు లాంటి తీర్పు వచ్చిందన్నారు. అందుకే కాంగ్రెస్ రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తుందని , ఎన్నికల వ్యవస్థపై అపనమ్మకం కలిగించి ఓటమికి ముందస్తు సాకులు వెతుక్కునే ప్రయత్నం చేస్తుందని ఘాటుగా విమర్శించారు. ప్రధానంగారాహుల్ గాంధీ ఒక "అరాచక శక్తిగా" మారి దేశ ప్రతిష్టను, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీస్తున్నారని, ఎన్నికల్లో గెలవలేక ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రజల సమస్యలపై కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ఎన్నికల సంఘం , ఎస్ ఐ ఆర్ ల పై కాంగ్రెస్ వివాదాలను లేవనెత్తి నిరసనలు చేయడం ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం లాంటిదన్నారు.కాంగ్రెస్ చేపట్టిన "నవంబర్ 1 రామ్‌లీలా నిరసన" రాజ్యాంగ పరిరక్షణ కోసం కాదని, కాంగ్రెస్ రాజకీయ క్రీడలో భాగమని స్పష్టం చేశారు . దేశంలో కాంగ్రెస్ అవలంబిస్తున్న విధానాలను , అరాచక పద్ధతులను ప్రజాక్షేత్రంలో ఎండ గట్టడానికి , ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి బిజెపి ఆధ్వర్యంలో ఈనెల 5న కరీంనగర్లో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో ప్రజలు ,యువత , మహిళలు స్వచ్ఛందంగా భారీ ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కరీంనగర్ నగర పాలక సంస్థ మహిళా కార్పొరేటర్లు, ,సర్పంచ్ లు వివిధ మండలాల మహిళా మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

- ఆర్జీ-త్రీ జిఎం సుంకర మధుసూదన్

రామగిరి, అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్):- సర్దార్ వల్లభాయ్ పటేల్ ను ఉక్కు మనిషి అని అందరూ అంటారని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా శనివారం జిఎం కార్యాలయం ఆవరణలో "జాతీయ ఐక్యతా దినోత్సవం" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేసి స్మరించు కున్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం అనంతరం నెహ్రూ మంత్రివర్గంలో హోం శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా విశిష్ట సేవలు అందించిన ఉక్కుమనిషి అని, స్వాతంత్ర్యం వచ్చిన తొలినాలలో ఉన్న సంస్థానాలను ఆయన ఓర్పు, నేర్పుతో, పట్టుదలతో అన్ని సంస్థానాలను విలీనం చేసి సంపూర్ణ భారతదేశాన్ని నిర్మించి, హైదరాబాద్ సంస్థానాన్ని కూడా భారత్ లో ఆపరేషన్ పోలో ద్వారా విలీనం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటుజిఎంలు బండి సత్య నారాయణ, యం.రామ్మోహన్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, యం డి.ఆసిఫ్, తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు

నమోదు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 31: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ 2026 షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం సవరించిందని కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం నోటీసుల పరిష్కారం, విచారణలు, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను నవంబర్ 26వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 30వ తేదీన తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 1,75,841 నోటీసులు జారీ చేయగా, వాటిలో 1,75,629 నోటీసులను ఓటర్లకు అందజేశామని కలెక్టర్ వివరించారు. మొత్తం 1,75,275 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని, వీరిలో 1,74,838 మందిని తుది జాబితాలో అర్హులైన ఓటర్లుగా చేర్చేందుకు క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. వివిధ కారణాల వల్ల 1,006 మంది ఓటర్లు అర్హులు కాదని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించి మొత్తం 3,080 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. గత 2024 ఎన్నికల సమయంలో ఖమ్మం జిల్లా నుంచి మొత్తం 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, ప్రస్తుత నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు 73,898 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి నమోదును మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి అర్హుడైన పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలంటే తాజాగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 25 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, గడువు లోగా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితా ముసాయిదాను నవంబర్ 25, 2026న ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముసాయిదా జాబితాపై డిసెంబర్ 10, 2026 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని పేర్కొన్నారు. డిసెంబర్ 25, 2026లోగా వాటిని పరిష్కరించి, డిసెంబర్ 30, 2026న తుది పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను ప్రచురించ నున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పీ. శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, బీజేపీ పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్వి ప్రతినిధి ఎల్. సురేష్ బాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టీఆర్ కృష్ణప్రసాద్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి వేల్పుల రాజయ్య, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

గంజాయి సాగు గుర్తిస్తే కఠిన చర్యలు

- చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలి

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు పేర్కొన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సీఓఆర్డీ) సమావేశంలో ఆయన పాల్గొని జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ యువత జీవితాలను మాదకద్రవ్యాల మహమ్మారి నాశనం చేస్తోందని, సరదా కోసం కూడా ఎటువంటి మత్తు పదార్థాలు చెడు అలవాట్లకు అలవాటు పడవద్దని సూచించారు. ఒకసారి మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ఎక్కడైనా గంజాయి సాగు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం గంజాయి సాగుదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం, కొనుగోలు, నిల్వ, అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అన్ని చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి వాహనాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో మాదకద్రవ్యాలకు సంబంధించిన ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమాలతో పాటు డ్రగ్స్ దుష్పరిణామాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ప్రజా ప్రదేశాలు, రవాణా కేంద్రాల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై నిరంతర అవగాహన కల్పించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైన వారు చికిత్స పొందేందుకు రామగుండం ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు.డీ-అడిక్షన్ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. డ్రగ్స్ విక్రయం, అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుమారస్వామి, జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

భారత ఉక్కు మహిళ ఇందిరా గాంధీకి ఘన నివాళులులి

ది క్రైమ్ న్యూస్ కూకట్పల్లి : దేశ ఐక్యతకు, సమగ్రతకు ప్రతీకగా నిలిచిన భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా న్యూఢిల్లీలోని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నివాళు లర్పించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఇందిరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పట్లోళ్ల నాగిరెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి, మహిళా సాధికారతకు ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆమె చూపిన ధైర్యసాహసాలు, నాయకత్వ పటిమ, త్యాగనిరతి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్, అశోక్ ముదిరాజ్ తదితరులు పాల్గొని ఇందిరమ్మకు ఘన నివాళులర్పించారు.

మహేశ్వరంలో రాజ్యం ఏలుతున్న మట్టి మాఫియా.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు పోలీసులు

మండల పరిధిలో ఏ గ్రామంలో చూసినా ఇదే తంతు

ఇదంతా జరుగుతున్న నిద్రపోతున్న మైనింగ్ అధికారులు

మహేశ్వరం, అక్టోబర్ 31 (ది క్రైమ్ న్యూస్), :చీకటి పడితే చాలు మట్టి మాఫియా మహేశ్వరం మండలంలో రాజ్యమేలుతున్న అధికారులు మాత్రం మౌనమే వహిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో మట్టి మాఫియా ఆగడాలు హద్దు మీరాయి. పగలంతా సైలెంట్.. చీకటి పడితే చాలు జేసీబీలు, టిప్పర్లతో దండయాత్ర. మండలంలో ఏ గ్రామంలో చూసినా ఇదే దందా నడుస్తోంది. ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి కొడుతున్నా అటు రెవెన్యూ, ఇటు పోలీసు, మైనింగ్ అధికారులు కళ్లు మూసుకుని కూర్చోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మహేశ్వరం, ఎన్ డి తండా, దుబ్బచెర్ల, నాగారం, తుమ్మలూరు, మన్ సాన్ పల్లి,, ఉప్పు గడ్డ తండా , తదితర గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ భూములు, రైతుల భూముల నుండి అక్రమంగా మట్టిని తోడేస్తున్నారు. అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే వందలాది టిప్పర్ల మట్టిని తరలించి, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ఫామ్ హౌస్ లకు అధిక ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ దందాతో రోడ్లన్నీ ధ్వంసమై, దుమ్ము ధూళితో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. ఈ దందా అంతా అధికారుల కనుసన్నుల్లోనే జరుగుతోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మట్టి మాఫియా నుండి నెలవారీ ముడుపులు ముడుతున్నందునే అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం, ఒక్క వాహనాన్ని కూడా సీజ్ చేయకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. పగటిపూట ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ఉన్నాయని చెబుతున్న అధికారులు, రాత్రి వేళ జరిగే అక్రమ తవ్వకాలపై ఎందుకు నిఘా పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా కమీషన్ల కోసమేనా ,,,,? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ స్పందించి, రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, అక్రమ మట్టి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరం మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

సాగు భూమి సంరక్షణ అందరి బాధ్యత

- ఉద్యానవన శాస్త్రవేత్త భాస్కర్

- వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ

రామగిరి,అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్) : సాగుభూమి సంరక్షణ అందరి బాధ్యత అని ఉద్యానవన శాస్త్రవేత్త భాస్కర్, కమాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ అన్నారు. కమాన్ పూర్ మండలం, సిద్దిపల్లి గ్రామంలో పంచాయతీ ఆవరణలో కేత్ బచావో అభియాన్ (సాగు భూమి సంరక్షణ కార్యక్రమం) నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, గిరి. రామకృష్ణ సార్ , అదేవిధంగా డా. బి. భాస్కర్ రావు, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రము రామగిరిఖిల్లా మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన రానున్న సీజన్లో తక్కువ నీటితో సాగు చేయగలిగిన పంటల రకాలు, యాజమాన్య పద్ధతులను, పంట మార్పిడి గురించి వివరించారు. అధిక ఆదాయాన్నిచ్చే పంటలైన కూరగాయలు మరియు ఆయిల్ పంటను సాగు చేసుకోవాల్సిందిగా సూచించారు. కూరగాయలలో బెండ, అలసంద, గోరుచిక్కుడు లాంటి పంటలు అదనపు ఆదాయాన్నిచ్చే బీర, సొర లాంటి పంటలను సాగు చేయాలని సూచించారు. బిందు సేద్య పద్ధతి, మల్చింగ్ చేయడం వలన నీరు ఆదా అవటంతో పాటు కలుపు నివారణ జరుగుతుందని తెలిపారు. ఆయిల్పామ్ పంట ఒకసారి నాటితే 40 సంవత్సరాల వరకు ప్రతి నెలకు ఆదాయం వస్తుందని, వరి మరియు పత్తి పంటలతో పోలిస్తే 2-3 రెట్లు ఎక్కువ ఆదాయం వస్తుందని దానిలో అంతర పంటలు సాగు చేసుకోవడం కూడా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధపల్లి గ్రామ సర్పంచ్ బంగారి కళ్యాణి మహేష్ , ఉప సర్పంచ్ కొత్తపల్లి సతీష్ , ఏఈఓ నవీన్, రైతులు, పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఏడు మండలాల ఎం.ఈ.ఓలు, ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని, రెమిడియేషన్, ఖాన్ అకాడమీ, ఎఫ్.ఎల్.ఎన్. తరగతులను మండల విద్యాధికారులు (ఎం.ఈ.ఓలు), ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం.లు) నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. శనివారం పెద్దపల్లిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడు మండలాల ఎం.ఈ.ఓలు, ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని, ఖాన్ అకాడమీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్, అభ్యసన ఫలితాలు, ఇతర పరిపాలనా అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాబోధనలో అనుసరించాల్సిన పద్ధతులను వివరిస్తూ, ఉపాధ్యాయులు తరగతి గదిలో ఫెసిలిటేటర్లుగా వ్యవహరించాలని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను వారే స్వయంగా మాట్లాడేలా ప్రోత్సహించాలని, కేవలం వినేవారిగా కాకుండా నేర్చుకున్న అంశాలను అర్థం చేసుకొని స్వయంగా వ్యక్తీకరించేలా బోధనా పద్ధతులు ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలైన వినడం, మాట్లాడడం, చదవడం, సృజనాత్మకంగా రాయడం వంటి సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, అవసరమైన అదనపు బోధన అందించడం ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. రెమిడియేషన్ తరగతులపై ప్రత్యేక దృష్టి.... తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతులు సమర్థవంతంగా కొనసాగాలని సూచించారు. గణితంలో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం అనే నాలుగు ప్రాథమిక ప్రక్రియల్లో విద్యార్థులు వంద శాతం నైపుణ్యం సాధించేలా బోధన చేపట్టాలని తెలిపారు. ఆయా తరగతుల ఫలితాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలని ఎం.ఈ.ఓలు, హెచ్.ఎం.లకు సూచించారు. ఖాన్ అకాడమీ నమోదు, ఫలితాల పర్యవేక్షణ... ఖాన్ అకాడమీలో విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు, విద్యార్థులు డిజిటల్ అభ్యసన ద్వారా సాధిస్తున్న ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల వినియోగం, అభ్యసన ఫలితాలను సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. ఎఫ్.ఎల్.ఎన్. ప్రగతిపై ప్రత్యేక కార్యాచరణ... ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విధంగా, ఉన్నత పాఠశాలలు కూడా మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయుల తరగతి బోధనను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ తమ పాఠశాలల్లో విద్యార్థుల అభివృద్ధి, అభ్యసన ప్రగతికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమం పురోగతి, ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ అంశాలపై డి.ఆర్.పీలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏ.ఎం.ఓ. డా. పి.ఎం. షేక్, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేంద్ర కుమార్, సుల్తానాబాద్, శ్రీరాంపూర్, ఓదెల, ధర్మారం, జూలపల్లి, ఎలిగేడు మండలాల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఆలోకిట్ ప్రతినిధులు ప్రమోద్, అంజద్, సమీద్, స్కూల్స్ ఇన్‌స్పెక్షన్ టీమ్ లీడర్ సి.హెచ్. ఆగయ్య, డి.ఆర్.పి.లు గడ్డం జగదీశ్వర్, కృష్ణమోహన్, జె. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్, రమేష్, మంజుల, జ్యోతి, కిరణ్, కృష్ణారెడ్డి, దేవేందర్, రవి, పుష్పలత, సి.ఆర్.పి.లు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి

- మరణానంతరం ఇద్దరికి చూపునివ్వడం గొప్ప సేవ
- సదాశయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం
- కొనియాడిన లయన్ కోలేటి మారుతి

రామగిరి,అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్) : నేత్రదానంపై ఉన్న అపోహలను వీడి ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని సదాశాయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ లింగమూర్తి పిలుపునిచ్చారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరికి చూపునిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఉమ్మడి కమాన్‌పూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వైనాల రాజు తండ్రి సాంబయ్య ఇటీవల మృతి చెందారు. తీవ్ర విషాదంలోనూ కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపునిచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం సాంబయ్య సంస్మరణ సభ కమన్పూర్ లయన్స్ క్లబ్, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విషాద సమయంలోనూ మానవతా దృక్పథంతో నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. నేత్ర, అవయవ, దేహదానాలు మహాదానాలని, వీటిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. గత 18 ఏళ్లుగా సదాశయ ఫౌండేషన్ నేత్రదానంపై చేస్తున్న కృషిద్వారా 1693 మానవతా మూర్తులునేత్ర దానాలు చేసారని తెలిపారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు ముఖ్య అతిథి డిఎంఓ ప్రవీణ్ రెడ్డి, లయన్స్ క్లబ్ కోలేటి మారుతీ, చేతుల మీదుగా అభినందన పత్రాన్ని అందజేసారు. వచ్చిన బందు మిత్రులకు లింగమూర్తి నేత్ర అవయవ దేహ దానాలపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో నేత్ర దానం చేసిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీ ఏ సీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్లతో పాటు తదితరులు ఉన్నారు.

కూకట్‌పల్లి ట్రాఫిక్ పిఎస్‌ను తనిఖీ చేసిన డీసీపీ శేషాద్రిని రెడ్డి

ది క్రైమ్యూ న్యూస్ కుకట్ట్‌పల్లి: సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-2 శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, అధికారుల పనితీరు, ట్రాఫిక్ విధులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, అంకితభావంతో వ్యవహరించాలని సూచించారు. రహదారులపై ట్రాఫిక్ ఉల్లంఘనలను అరికడుతూ, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-2 ఏడీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, సీఐ తిమ్మప్పతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పై మంది కల్వకోల్ యువకులు రక్తదానం

మహేశ్వరం అక్టోబరు 31 (ది క్రైమ్ న్యూస్) : మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన బక్కని రవి మాదిగ ఆధ్వర్యంలో సుమారు 30 మంది యువకులు మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి , ఏసీపీ జానకి రెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరంలో కల్వకోల్ గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా బక్కని రవి మాదిగ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన బాధితులకు సకాలంలో రక్తం అందించడం ద్వారా ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదానంపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలని, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎస్సీ ఎస్టీ జిల్లా కమిటీ మెంబర్ విజయ్ కుమార్, మహేశ్వరం సీఐ రాఘవేందర్ రెడ్డి, కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు , ఎస్సైలు మారయ్య, ప్రసాద్, ధనుంజయ్, మండల తహశీల్దార్ చిన్నప్పల నాయుడు, బక్కని సుమన్, కొండని మధు, కొండని బన్నీ, బదుసు లక్ష్మణ్, బక్కని సిద్దులు, బక్కని భరత్, ఎర్ర నవీన్, కొండన్ మధుకర్, బక్కని వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించండి

పటాన్ చేరులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి ఏర్పాటు కావడం సంతోషకరం

ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్

సంగారెడ్డి జిల్లా(ది క్రైమ్ న్యూస్) : పటాన్ చేరు ప్రాంతలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న లక్ష్యంతో మరిన్ని ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. శనివారం పటాన్ చేరు లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరై ఆసుపత్రిని ప్రారంభించి, అందుబాటులోకి తీసుకువచ్చిన ఆధునిక వైద్య సదుపాయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చేరు పారిశ్రామికంగా, జనాభా పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు ఏర్పాటు కావడం శుభపరిణామమన్నారు. వైద్య సేవలు కేవలం ఆర్థిక స్థోమత కలిగిన వారికే పరిమితం కాకుండా పేదలకు కూడా అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసుపత్రి యాజమాన్యం నాణ్యమైన వైద్య సేవలతో పాటు పేదలకు అందుబాటు ధరల్లో వైద్యం అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వెంకట్ ఆలపాటి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, పృథ్వీరాజ్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సర్దార్ పటేల్ నగర్‌లో వైభవంగా జాతీయ ఐక్యత దినోత్సవం

ది క్రైమ్ న్యూస్ కూకట్పల్లి : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ చైర్మన్, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ని, ఎంపీ ఈటల రాజేందర్ ని మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ ఐక్యత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారత తొలి ఉప ప్రధాని, 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం వందలాది సంస్థానాలను ఏకతాటిపైకి తెచ్చి అఖండ భారతదేశాన్ని నిర్మించడంలో పటేల్ పోషించిన పాత్ర అద్భుతమైనదని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, యువభారత్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థి-విద్యార్థినులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు, కార్మికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

: కొండేటి శ్రీను

నల్గొండ జిల్లా ప్రతినిధి । ది క్రైమ్ న్యూస్ । అక్టోబర్ 31 : అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా వెంగన్నగూడెం, పార్వతీపురం, రాజన్నగూడెం, మర్లగడ్డ క్యాంపు, వడ్డెరగూడెం, వల్లభవపురం, ఇండ్ల కోటయ్యగూడెం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీను మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి, వలసవాదానికి వ్యతిరేకంగా సాగిన పోరాటాల నేపథ్యంలో 1936లో అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించిందని, నేటికి 90 ఏళ్లు పూర్తవుతున్నాయని తెలిపారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి చారిత్రక నేపథ్యమున్న నల్గొండ గడ్డపై తొలిసారిగా 36వ జాతీయ మహాసభలు నిర్వహించడం విశేషమన్నారు. నవంబర్ 15న నల్గొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో లక్షలాది మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1,500 మంది రైతు ఉద్యమ నాయకులు, ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మహాసభల్లో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు చక్కెర, నూనె, ఇతర నిత్యావసర వస్తువులు కలిపి 18 రకాల సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతు భరోసా, రైతు బీమా, పంట రుణమాఫీ పథకాలను అర్హులైన రైతులకు అందించాలని కోరారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం వంటి మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఉపాధి హామీ పనులను మండలంలోని అన్ని గ్రామాల్లో వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవంబర్ 15న ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు రైతులు, కార్మికులు, యువత, మహిళలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కొండేటి శ్రీను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కుంచెం శేఖర్, వరలక్ష్మి, ధనమ్మ, శ్రీను, శ్రీధర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ మిమిక్రీ కళాకారుడు అరుకుల సత్యనారాయణ గౌడ్‌కు ఘనంగా నివాళులు

జీబీఎన్ ఎలైట్ సొసైటీ ఆధ్వర్యంలో సంతాప సభ

హైదరాబాద్ ప్రతి నిధి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబర్ 31: ప్రముఖ కళాకారుడు, మిమిక్రీ, మ్యాజిక్, వెంట్రిలాక్విజం ప్రదర్శనలతో వేలాది మంది ప్రేక్షకులను అలరించిన స్వర్గీయ అరుకుల సత్యనారాయణ గౌడ్‌కు జీబీఎన్ ఎలైట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సంతాప సభలో పలువురు కళాకారులు, మిత్రులు, అభిమానులు పాల్గొని ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 40 ఏళ్ల వయసులోనే అకాల మరణం చెందిన సత్యనారాయణ గౌడ్ తన 15 ఏళ్లకు పైగా కళా ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన ప్రదర్శనలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మిమిక్రీ, మ్యాజిక్, వెంట్రిలాక్విజం వంటి విభిన్న కళారూపాల్లో ప్రతిభ చాటుతూ రెండు వేలకు పైగా వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. తన హాస్య చతురతతో, వినూత్న ప్రదర్శనలతో వేలాది మంది ప్రేక్షకుల ముఖాల్లో చిరునవ్వులు పూయించారు. ఇటీవల హకీంపేటలో బతుకమ్మ వేడుకల్లో కళా ప్రదర్శన ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృత్యువాత పడ్డారు. ఆయన ఆకస్మిక మరణం కళారంగానికి, స్నేహితులకు, అభిమానులకు తీరని లోటుగా మిగిలింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సత్యనారాయణ గౌడ్ కేవలం గొప్ప కళాకారుడే కాకుండా అందరినీ నవ్విస్తూ, ఆప్యాయంగా పలకరించే మంచి మనసున్న వ్యక్తి అని కొనియాడారు. వేదికపై తన ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన ఆయన, వ్యక్తిగత జీవితంలోనూ ఎంతోమంది అభిమానాన్ని సంపాదించుకున్నారని గుర్తుచేసుకున్నారు. ఆయనతో కలిసి గడిపిన క్షణాలను స్మరించుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. జీబీఎన్ ఎలైట్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ సత్యనారాయణ గౌడ్ అందించిన కళా సేవలు, ఆయన పంచిన నవ్వులు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, కళాకారుడిగా సంపాదించుకున్న కీర్తి, అభిమానుల హృదయాల్లో ఆయనకు ఉన్న స్థానం చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు స్వర్గీయ అరుకుల సత్యనారాయణ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. నవ్వులు పంచిన కళాకారుడు భౌతికంగా దూరమైనా.. ఆయన కళా జ్ఞాపకాలు, ఆప్యాయతలు ఎప్పటికీ తమ హృదయాల్లో నిలిచిపోతాయని ఈ సందర్భంగా పలువురు భావోద్వేగంగా పేర్కొన్నారు. సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులకు జీబీఎన్ ఎలైట్ సొసైటీ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జీబీఎన్ ఎలైట్ సొసైటీ నాయకులు ర్యాకల లక్ష్మి నారాయణ గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్ ముద్దం, పల్లె సాయి చరణ్ గౌడ్, శివకుమార్ గౌడ్, మట్ట రాజు గౌడ్, మధుసూదన్ గౌడ్, మలుగురు శేఖర్ గౌడ్, ముత్యం శ్రీనివాస్ గౌడ్, అములకొండ శ్రీనివాస్ గౌడ్, వంగాల బాలరాజ్ గౌడ్, అంబటి రాజేందర్ గౌడ్, పెద్ది శంకర్ గౌడ్, బుర్ర సాయి కుమార్, రవిందర్ గౌడ్, అడ్వైజర్ ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్, ఎరుపల్లి శర్ముఖ రావు, సత్యనారాయణ గౌడ్ కుటుంబ సభ్యులు పంజాల కాటం, ఎల్లంకి వెంకటేశ్వర్లు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమం

ది క్రైమ్ న్యూస్ కూకట్పల్లి : ఉమ్మడి హైదరాబాద్ -- రంగారెడ్డి -- మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో భారీ ఎత్తున గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కే పీ హెచ్ బి కాలనీలోని రమ్యా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీ పీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు రంగమోహన్, నలినీకాంత్, రవి, కళ్యాణ్, రమణల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రాడ్యుయేట్లు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ల చురుగ్గా పాల్గొనడం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొని ఓటర్ల సమన్వయం ప్రక్రియను విజయవంతం చేశారు.

పది దొంగతనాల కేసుల్లో నిందితుడి అరెస్ట్

గతంలో 18 కేసులు.. జైలు నుంచి విడుదలైన తర్వాత మళ్లీ చోరీలు

బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, స్మార్ట్‌వాచ్ స్వాధీనం

మేడ్చల్, అక్టోబర్ 31: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. చక్రిపురం ఎక్స్‌రోడ్స్ వద్ద శనివారం ఉదయం 11.30 గంటలకు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో పలు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడికావడంతో మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రతిరామ్ తండాకు చెందిన గుగులోత్ నవీన్ (23)ను నిందితుడిగా గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితుడికి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు, మేడిపల్లి పరిధిలో రెండు, పోచారం ఐటీ కారిడార్ పరిధిలో మూడు, ఘట్‌కేసర్ పరిధిలో రెండు చొప్పున మొత్తం పది దొంగతనం కేసులతో సంబంధం ఉన్నట్లు తేలింది. ఈ మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో 802/2026, 784/2026, 785/2026, మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో 484/2026, 1510/2026, పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో 584/2026, 593/2026, 589/2026, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో 625/2026, 626/2026 క్రైమ్ నంబర్లతో కేసులు నమోదయ్యాయి. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎస్ రావు నగర్, రుక్మిణిపురి కాలనీ, కృష్ణవేణి హైట్స్‌లో నివాసముంటున్న ఎన్. మధన్ రాజ్ (47) అక్టోబర్ 20న ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదుదారుడు అక్టోబర్ 19న ఉదయం 11.30 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి బాసర ఆలయ దర్శనానికి వెళ్లే ముందు ఇంటికి తాళం వేసి వెళ్లారు. మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తిరిగి వచ్చి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటంతో పాటు బెడ్‌రూమ్‌లోని అల్మారా తెరిచి కనిపించింది. పరిశీలించగా సుమారు 371 గ్రాముల బరువున్న బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని నుంచి సుమారు 1.37.5 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక స్మార్ట్‌వాచ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పదో తరగతి వరకు చదువుకున్న అనంతరం వైద్య ప్రయోగశాల సాంకేతిక విద్యలో కోర్సు పూర్తి చేసి ప్రయోగశాల సాంకేతిక నిపుణుడిగా పనిచేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. తన వ్యసనాలకు అవసరమైన డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో అతనిపై సుమారు 18 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, ఆయా కేసుల్లో జైలుకు కూడా వెళ్లినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 7న జనగామ జిల్లా జైలు నుంచి విడుదలైన అనంతరం తిరిగి ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడు రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల్లో సంచరిస్తూ తాళాలు వేసి ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లను లక్ష్యంగా చేసుకునేవాడు. ఇంటి తాళాలు పగలగొట్టి లేదా ఇతర మార్గాల్లో లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చోరీ చేసేవాడని పోలీసులు వెల్లడించారు. ప్రజలకు పోలీసుల సూచనలు ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంట్లోని విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ రోజులు ఊరికి వెళ్లే సందర్భంలో సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ఇళ్ల ప్రధాన ద్వారాలకు నాణ్యమైన తాళాలు, కేంద్ర తాళాల వ్యవస్థతో పాటు అలారం పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇంటి ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి అవి నిరంతరం పనిచేసేలా చూసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ సంఘాలు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవడంతో పాటు కాపలాదారులను నియమించుకోవాలని సూచించారు. ఇళ్లలో పనిచేసే సహాయకులు, అద్దెకు నివసించే వారి వివరాలను మీ-సురక్ష యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. వాహనాల దొంగతనాల నివారణకు ప్రత్యేక భద్రతా తాళాలు, ఇతర రక్షణ పరికరాలను వినియోగించాలని, వీలైనంత వరకు జీపీఎస్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లును పోలీస్ కమిషనర్ సుమతి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ జోన్ అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకట్ రెడ్డి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలి

రక్షణ సూత్రాలు పాటిస్తూ వార్షిక లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

ఏఎల్‌పీ గనిని సందర్శించిన డైరెక్టర్ (ఈ అండ్ ఎం) యం. తిరుమల రావు

రామగిరి, అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్):-గనుల్లో ఉపయోగించే యంత్రాల పనితీరు, ఉత్పాదకత, భద్రతను మెరుగుపరచడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో తోడ్పడుతుందని డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం.తిరుమలరావు అన్నారు.సింగరేణి అడ్రియాల లాంగ్‌వాల్ (ఏఎల్‌పీ) గనిని శనివారం డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం.తిరుమలరావు సందర్శించారు.ఈ సందర్భంగా వివిధ విభాగాలను సందర్శించి, లాంగ్‌వాల్ మైనింగ్ కార్యకలాపాలను పరిశీలించారు. ముఖ్యంగా గనిలో బొగ్గు ఉత్పత్తికి వినియోగిస్తున్న ఆధునిక యంత్రాలు, వాటి పనితీరు, యాంత్రిక పరికరాల నిర్వహణ, ఉత్పత్తి ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. గనిలో యంత్రాల నిరంతర పనితీరును కొనసాగించేందుకు తీసుకుంటున్న చర్యలు, యంత్రాల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి, నాలుగు వ ప్యానల్ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గని కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు అవసరమైన సూచనలు చేశారు.అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో కొనసాగుతున్న కార్యకలాపాలు, ఉత్పత్తి లక్ష్యాలు, యంత్రాల పనితీరు, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించిన వివరాలను అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు వివరించారు.అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్టులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించు కోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, ఏరియా ఇంజినీర్ దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ బాలరాజు, మేనేజర్ పెంచలయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఉప ప్రధాని ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

ధర్మపురి, అక్టోబర్ 31, (ది క్రైమ్ న్యూస్) : భారత మొదటి ఉప ప్రధాని ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పటేల్ గ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యంగా స్వాతంత్రము అనంతరం 565 సంస్థానాలుగా విడిపోయిన భారతదేశాన్ని భారత యూనియన్లో విలీనం చేయడం జరిగిందని అలాగే వివిధ రంగాల్లో వారు తీసుకువచ్చిన సంస్కరణలను గుర్తు చేశారు. ఆపరేషన్ పోలో ద్వారా తెలంగాణ నిజాం రజాకార్ల కబంధహస్తాల నుండి ప్రజలను విముక్తి ప్రసాదించిన గొప్ప మహనీయులు అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛ ఆయన చలవ వల్లనే అని ప్రతి ఒక్కరు దేశ సమైక్యత, సమగ్రతను, జాతీయ ఐక్యతను కాపాడడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కస్తూ రాజన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత ప్రాంత టోలీ సభ్యులు అల్లం దుర్గాప్రసాద్, నగర సహకార దర్శి వెలగందుల రవి, మండల సత్సంగ్ ప్రముఖ చిపిరుశెట్టి దేవేందర్, బజరంగ్దళ్ ప్రఖండ సంయోజక కాసెట్టి హరీష్, బజరంగ్దళ్ నగర సంయోజక్ ఆసం సురేష్, బీజేపీ సీనియర్ నాయకులు తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ నలమాస వైకుంఠం, ఒగేటి అంజన్న మాజీ గ్రామ సర్పంచ్ వడ్నాల మల్లేషమ్, రంగు శ్రీధర్, చిర్ర రత్నాకర్, పల్లేరుల సురేందర్, కొత్తపల్లి కిషన్, కొంపల్లి ప్రసాద్, అంబటి లక్ష్మణ్, వడ్నాల హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల జాబితాలో గుర్రంపోడు, అనుముల మండలాలకు చోటు కల్పించాలి

జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్సీ కోటిరెడ్డి వినతిపత్రం

నల్లగొండ జిల్లా ప్రతినిధి । ది క్రైమ్ న్యూస్ । అక్టోబర్ 31 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో నల్లగొండ జిల్లాలోని గుర్రంపోడు, అనుముల మండలాలకు చోటు కల్పించకపోవడంపై ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి స్పందించారు. ఈ రెండు మండలాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వెంటనే కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గుర్రంపోడు మండల బీఆర్ఎస్ నాయకులు, అనుముల మండల నాయకులతో కలిసి ఎమ్మెల్సీ కోటిరెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో గుర్రంపోడు, అనుముల మండలాలను చేర్చకపోవడం పట్ల రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఈ రెండు మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, పంటల సాగు, దిగుబడులపై కరువు ప్రభావం, రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ ఇబ్బందులను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. కేవలం నివేదికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని అధికారులు స్వయంగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలన్నారు. రైతులు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని గుర్రంపోడు, అనుముల మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కరువు మండలాలుగా ప్రకటిస్తే రైతులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయ సహకారాలు, పరిహారం, ఇతర ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ కోటిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు పాశం గోపాల్ రెడ్డి, మునుకుంట్ల రాజేష్ రెడ్డి, తెలంగాణ ఉద్యమ నాయకులు పగిళ్ల సైదులు, వేముల యాదయ్య, పోలే రామచంద్రం, మల్లేష్, కురుమాల్ రెడ్డి, బచ్చనబోయిన శీను, వెంకట్ రెడ్డి, శ్రీరాములు, మేక రఘుపతి రెడ్డి, మారపాక వెంకటయ్య, చంద్రయ్య, ఓంకారం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు, త్యాగాలు దేశ చరిత్రలో చిరస్మరణీయం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

నల్గొండ జిల్లా ప్రతినిధి । ది క్రైమ్ న్యూస్ । అక్టోబర్ 31 : భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ సేవలు, త్యాగాలు దేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో స్వర్గీయ ఇందిరా గాంధీ 42వ వర్ధంతి కార్యక్రమాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తదుపరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. దేశ సమగ్రత కోసం ధైర్యంగా నిర్ణయాలు తీసుకున్న నాయకురాలు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలు, చేసిన త్యాగాలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు, తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు భారత రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరా గాంధీ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, దేశ అభివృద్ధి లక్ష్యంగా ఆమె అనుసరించిన విధానాలు భారతదేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించాయని వివరించారు. ముఖ్యంగా మహిళలు రాజకీయ, సామాజిక రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఇందిరా గాంధీ నాయకత్వం ఎంతో స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ దేశ నాయకత్వ బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన ఆమె జీవితం మహిళా లోకానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఇందిరా గాంధీ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, దేశాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ మానవత్వం

ఇద్దరికి చూపునివ్వనున్న వృద్ధురాలి నేత్రాలు!

- తల్లి చివరి చూపును సజీవంగా ఉంచిన కుటుంబ సభ్యులు

- అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

రామగిరి, అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం సెంటినరీ కాలనీ రామ్‌నగర్‌కు చెందిన కచ్చకాయల ఓదెమ్మ (85) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషాదంలోనూ ఆమె కుటుంబ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. తల్లి నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారుడు నూక రమేష్ ఆధ్వర్యంలో వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. తల్లి నేత్రదానానికి అంగీకరించిన కుమారులు కనకయ్య, రాజయ్య, కోడళ్లు శోభారాణి, రాజ్యలక్ష్మి, కుమార్తె సుగుణ, అల్లుడు బానయ్యలను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, గంట వెంకట రమణారెడ్డి,లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, కొండ సమ్మయ్య,వెల్దీ కవిత అనంతరాములు, శివ పటేల్,కేఎస్ వాసు తదితరులు అభినందించారు.

మంథనిలో అధిక ధరల దందా..

కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త

రామగిరి , అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్):- మంథని పట్టణంలో కిరాణా దుకాణాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో ఇష్టారాజ్యంగా అధిక ధరలు వసూలు చేస్తున్నారని, అధికారులు తక్షణమే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త నాయిని సంతోష్ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆయన కలెక్టరేట్ లో వినతిపత్రం అందజేసిన అనంతరం మాట్లాడుతూ మంథని పట్టణంలో నిత్యావసర సరుకుల ధరలు సామాన్యుడికి భారంగా మారాయన్నారు. గ్యాస్ ధరలు పెరిగాయనే సాకుతో గత ఏడాది పెంచిన టిఫిన్, భోజనం ధరలు గ్యాస్ ధరలు తగ్గినా ఇప్పటివరకు తగ్గించలేదన్నారు. హోటళ్లలో ఒక ప్లేట్ ఇడ్లీ, దోశ ధరలు అమాంతం పెంచేశారని, క్వాలిటీ మాత్రం దిగజారిందని ఆరోపించారు. అలాగే కిరాణా దుకాణాల్లో బియ్యం, నూనె, పప్పులు తదితర నిత్యావసర సరుకులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని, బిల్లులు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఆహార, పౌర సరఫరాల శాఖ, తూనికలు, కొలతల శాఖ అధికారులు మంథని పట్టణంలోని అన్ని వ్యాపార సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మేవారిపై, రేటు లిస్టు ప్రదర్శించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరినట్లు నాయిని సంతోష్ తెలిపారు. సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో నిత్యావసరాలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎక్సైజ్ సీఐ మధు

మేడ్చల్, అక్టోబర్ 31(ది క్రైమ్ న్యూస్) : డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని కాప్రా ఎక్సైజ్ సీఐ మధు అన్నారు. శనివారం కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మధు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనమవడంతో పాటు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాల వినియోగానికి అలవాటు పడకుండా తమ తోటి విద్యార్థులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ గుర్తించి, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని సీఐ మధు పిలుపునిచ్చారు.

రజనీకాంత్ 'జైలర్ 2' అరుదైన రికార్డు..

రూ.800 కోట్ల దిశగా పరుగులు, నాలుగు రాష్ట్రాల్లో సరికొత్త చరిత్ర!

సూపర్‌స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'జైలర్ 2' వసూళ్లలో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ దూసుకెళ్తోంది. 2023లో విడుదలై సంచలన విజయం సాధించిన 'జైలర్' చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధిస్తోంది. ఇప్పటికే రూ.800 కోట్ల మార్కుకు చేరువలో ఉన్న ఈ చిత్రం మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. 'జైలర్ 2' బాక్సాఫీస్ ప్రయాణంలో అత్యంత ప్రత్యేకమైన విషయం ప్రాంతాలవారీగా సాధించిన వసూళ్లు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, కేరళ.. ఇలా నాలుగు ప్రాంతాల్లోనూ ఒక్కొక్కటిగా రూ.75 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి చిత్రంగా 'జైలర్ 2' కొత్త రికార్డు సృష్టించింది. సాధారణంగా ఒక సినిమా తన సొంత రాష్ట్రంలో భారీ వసూళ్లు సాధించడం సహజం. కానీ ఇతర భాషా ప్రాంతాల్లోనూ ఇదే స్థాయిలో ఆదరణ పొందడం విశేషం. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రజనీకాంత్‌కు ఉన్న అభిమాన బలం మరోసారి నిరూపితమైంది. కర్ణాటక, కేరళలోనూ ఈ సినిమాకు మంచి స్పందన లభించడంతో ప్రాంతీయ హద్దులను దాటి తలైవా క్రేజ్ కొనసాగుతోందని ఈ వసూళ్లు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.800 కోట్ల దిశగా సాగుతున్న ఈ చిత్రం రాబోయే రోజుల్లో మరిన్ని రికార్డులను అందుకుంటుందా అన్న ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. సన్ పిక్చర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించారు. ఆయనకు జోడీగా కాకుండా కథలో కీలక పాత్రల్లో విద్యాబాలన్, ఎస్.జే. సూర్య, సూరజ్ వెంజరమూడు, మిథున్ చక్రవర్తి, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, నమో నారాయణ్ వంటి ప్రముఖ నటులు కనిపించారు. ఇక ఈ సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా పలువురు స్టార్ హీరోల అతిథి పాత్రలు నిలిచాయి. హృతిక్ రోషన్, మోహన్‌లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రల్లో కనిపించడం సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది.

శ్రీలీలకు మరో లక్కీ ఛాన్స్

ఒకప్పుడు ఐటమ్ సాంగ్స్ కోసం సెపరేట్ గా కొంత మంది హాట్ బ్యూటీలు ఉండే వారు. లేదంటే సెపరేట్‌గా కొంత మోడల్స్ అని ఐటెం గర్ల్స్ అని విదేశాల నుంచి తెల్ల తోలు బ్యూటీలని దింపే వారు. ఎందుకంటే హీరోయిన్‌లు ఇలాంటి పాటలు చేయడానికి నిరకరించేవారు. కానీ ప్రజెంట్ స్టార్ హీరోయిన్స్ మాత్రం ఐటెం సాంగ్స్ చేసేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదు. క్రేజ్‌కి క్రేజ్, రెమ్యునరేషన్‌కి రెమ్యునరేషన్ వస్తుండడంతో అసలు వదులుకోవడం లేదు. ఇందులో భాగంగా తాజాగా టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల.. మరో స్టార్ హీరోతో ఐటెం సాంగ్ చేసే ఛాన్స్ దక్కిందట. మెగా హీరో రామ్ చరణ్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది'. ఉప్పెన' ఫేమ్ సానా బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, ఇందులో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఇందులో ఓ మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నాడట బుచ్చిబాబు. దీని కోసం రామ్ చరణ్ సరసన శ్రీ లీల స్టెప్పులు చేయబోతోందట. ఈ ఫుల్ ఎనర్జిటిక్ మాస్ సాంగ్‌తో థియేటర్ దద్దరిల్లేలా చేయనుందట శ్రీలీల. ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తేలినప్పటికీ ప్రజంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

ప్రేమలో పడ్డ జానులిరి, దిలీప్ దేవ్‌గన్

ప్రముఖ ఫోక్ డ్యాన్సర్ జానులిరి గురించి ఈ నడుమ ఓ విషయం బాగా వైరల్ అవుతోంది. యూట్యూబర్, ఫోక్ సింగర్ అయిన దిలీప్ దేవ్ గన్ తో ప్రేమలో ఉందని.. త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నా రంటూ వార్తలు వచ్చాయి. కొన్ని రకాల ట్రోల్స్, మీమ్స్ కూడా వచ్చాయి. దీంతో జానులిరి తీవ్ర ఆవేదనతో వీడియో చేసింది. తనపై ట్రోల్స్ తట్టుకోలేకపోతున్నానని.. చనిపోవాలని ఉందంటూ వీడియోలో ఏడ్చేసింది. ఆ వీడియో సంచలనం రేపుతున్న క్రమంలోనే.. దిలీప్ దేవ్ గన్ వీడియో రిలీజ్ చేశాడు. 'మీరందరూ అనుకున్నట్టు- నేను, జానులిరి పెళ్లి చేసుకోబోతున్నాం. రీసెంట్ గా నేను పెట్టిన పోస్టులో ఉన్నది జానులిరినే' అంటూ తెలిపాడు దిలీప్. మేం ఎలాంటి తప్పు చేయలేదు. మనస్ఫూర్తిగా కలిసి ఉండాలని నిర్ణయించుకున్నాం. అందుకే పెళ్లి చేసుకోబోతున్నాం. త్వరలోనే మా పెళ్లి జరుగుతుంది. మా ఇంట్లో ఒప్పుకున్నారు. వాళ్ల ఇంట్లో కూడా ఒప్పుకున్నారు. మీరు మమ్మల్ని ఎంత ట్రోల్స్, మీమ్స్ చేసినా తట్టుకునే శక్తి మాకు ఉంది. మీ అందరి సపోర్ట్ మాకు ఉంటు-ందని కోరుకుంటున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు దిలీప్. ఇంకేముంది ఈ వీడియో క్షణాల్లోనే వైరల్ అయిపోతోంది. ఫోక్ ఇండస్ట్రీలో జానులిరి ఎంత ఫేమస్సో.. దిలీప్ కూడా అంతే ఫేమస్. డ్యాన్సర్ గా జానులిరి, సింగర్ గా దిలీప్ చాలా ఫేమస్. దిలీప్ ఛానెల్ లో జానులిరి కొన్ని ఫోక్ సాంగ్స్ కూడా చేసింది. అప్పటి నుంచే వీరిద్దరి మధ్య పరిచయం పెరిగి ప్రేమగా మారిందని తెలుస్తోంది. రీసెంట్ గా దిలీప్ ఓ సంచలన పోస్టు పెట్టాడు. అతను ఓ అమ్మాయితో క్లోజ్ గా ఉన్న పిక్ పోస్టు చేశాడు. కానీ అందులో ఆమె ముఖం కనిపించలేదు. అయితే ఆమె జానులిరినే అని అందరూ కనిపెట్టేశారు. అప్పటి నుంచే ఈ రూమర్లు ఎక్కువయ్యాయి. మొత్తానికి వీరిద్దరూ ఒక్కటి అవుతుండటం పెద్ద సంచలనమే రేపుతోంది.

శంషాబాద్‌లో ఘనంగా 'ఓ నా సిద్ధయ్య' పాట విడుదల..

హాజరైన సోనూసూద్!

భారతీయ సినీ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతూ శంషాబాద్ ప్రభుత్వ కళాశాల, పాఠశాల మైదానంలో 'ఓ నా సిద్ధయ్య' ప్రైవేట్ ఆల్బమ్ సాంగ్ లాంచ్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. భారతదేశంలోనే తొలిసారిగా అవుట్‌డోర్ వేదికపై 70ఎంఎం భారీ స్క్రీన్ మరియు డాల్బీ అట్మాస్ సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి ఈ పాటను విడుదల చేశారు. అక్టోబర్ 30న శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి భారీ వర్షం కురుస్తున్నప్పటికీ, 5 వేల మందికి పైగా ప్రేక్షకులు తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అభిమానులు ఈ వేడుకను విజయవంతం చేశారు. ఈ గ్రాండ్ ఈవెంట్‌కు ప్రముఖ నటుడు సోనూసూద్ ముఖ్య అతిథిగా హాజరై పాటను లాంచ్ చేయగా, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మరో ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరో ఇంద్రరామ్, సింగర్ నల్గొండ గద్దర్ నరసన్న, ప్రముఖ గాయకుడు, మ్యూజిక్ డైరెక్టర్ బోలే షావలి, నటుడు ఉత్తేజ్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. పల్లెటూరి నేపథ్యంలో భార్యాభర్తల ప్రేమానుబంధం, కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా నిలిచే తత్వాన్ని ఆవిష్కరిస్తూ తెరకెక్కిన ఈ పాటను సిద్ధు రెడ్డి కందకట్ల నిర్మించగా, సిద్ధయ్య పాత్రలో నటించారు. ఈ వేడుక కేవలం వినోదానికే పరిమితం కాకుండా, ఆటో డ్రైవర్లకు బీమా సదుపాయాలు మరియు కార్మికులకు హెల్మెట్ల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలతో మరింత ఆదర్శంగా నిలిచింది.

మరోమారు జోడీ కట్టబోతున్న రష్మిక, విజయ్

ఆన్‌స్క్రీన్‌పై కొన్ని జోడీలకు ప్రత్యేకమైన ఫ్యాన్స్ ఉంటారు. అలాంటి ఓ జోడీనే విజయ్ దేవరకొండ- రష్మికలదని చెప్పవచ్చు. వీరిద్దరూ కలిసి వెండితెరపై రెండుసార్లు సందడి చేశారు. వీరిద్దరూ కలిసి 'గీత గోవిందం'లో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. దీని తర్వాత 'డియర్ కామ్రేడ్'తో అలరించారు. ఈ చిత్రం కమర్షియల్‌గా హిట్ కాకపోయినప్పటికీ యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. కెరీర్‌లో ఎన్ని సినిమాలు చేసినా ఈ చిత్రం వారికెంతో ప్రత్యేకమని గతంలో విజయ్, రష్మిక ఇద్దరూ వెల్లడించారు.ఇప్పుడు ఈ జోడీ మరోసారి ప్రేక్షకులను పలకరించనున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా మైత్రీ మూవీస్ పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రి÷-లపై ఇవ్వడంతో ఆ వార్తలకు బలం చేకూరింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'కింగ్‌డమ్'తో బిజీగా ఉన్నారు. దీనితో పాటు ఆయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందనున్న ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే నెల నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. ఇప్పుడీ చిత్రంలో విజయ్ సరసన రష్మిక నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై నిర్మాణసంస్థ ఓ పోస్ట్ పెట్టింది. వేచి చూద్దాం అని అర్థం వచ్చేలా ఉంది. దీనికి రష్మిక ఓకే..' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేశారు. దీంతో వీరిద్దరి జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. ఇదే నిజమైతే ముచ్చటగా మూడోసారి ఈ జోడీని చూడొచ్చని సంబరపడుతున్నారు.

చిక్కుల్లో గాయకుడు సోనూ నిగమ్

ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ (చిక్కుల్లో పడ్డారు. ఇటీవల బెంగుళూర్‌లో జరిగిన ఓ ప్దర్శనలో పలహల్గామ్ ఘటనపై అనుచితంగా నోరు పారేసుకున్నాడు. దీంతో ఇప్పుడు అతనిపై అంతా మండిపడుతున్నారు. అక్కడ ఓ అభిమాని తనతో దురుసుగా ప్రవర్తించాడని ఆయన వెల్లడించారు. సోనూ నిగమ్ వేదికపై పాటలు పాడుతున్న సమయంలో ఓ అభిమాని కన్నడలోనే పాడాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో సహనం కోల్పోయిన సోనూ పాటలు పాడడం ఆపేసి కన్నడ ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. పహల్గాం విషాదాన్ని ప్రస్తావించారు. 'పహల్గాంలో ఏం జరిగిందో దానికి ఇదే కారణం. కచ్చితంగా ఇదే.. ఇప్పుడు మీరు ఏం చేశారో అలాంటి కారణంగా ఆ దాడి జరిగింది. డిమాండ్ చేసే ముందు కనీసం మీ ముందు ఎవరున్నారో చూడండి' అని ఘాటు-గా స్పందించారు. సోనూ భాషను ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసినప్పటికీ కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయన భాషా విద్వేషాన్ని రెచ్చగొట్టారని కన్నడ ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సింగర్‌పై కొంతమంది ఆడియన్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు- సమాచారం.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056